# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
5-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 103

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


*రాజకీయాల్లో దూకుడు చాలా అవసరం. కానీ అది ఎక్కువైతే చేటు తెచ్చిన సందర్భం కూడా ఉంటుంది. అయితే రాజకీయాల్లో రాణించాలనుకునేవారు ప్రజలతో మమేకం అయి పని చేయాలి. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నడుచుకోవాలి. లేకుంటే చాలా కష్టం. అయితే ఈ విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక అని చెప్పుకోవాలి. రాజకీయాలంటేనే వారసత్వం ఒక అర్హతగా భావించే రోజులు ఇవి. కానీ అటువంటిది ఏ బ్యాక్గ్రౌండ్ లేకుండా.. ఢిల్లీ స్థాయిలో అండదండలు లేకుండా తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు అంటే.. దటీజ్ వన్ అండ్ ఓన్లీ రేవంత్ రెడ్డి కే సాధ్యం అయింది. కేవలం తన వాగ్ధాటితో, అలుపెరగని పోరాట శైలితో ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం అనేది రేవంత్ రెడ్డి కే సాధ్యమైంది. తెలంగాణ సీఎం రేవంత్ రెండు దశాబ్దాల రాజకీయ జీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కథనం.*

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో**



# అతడే ఒక సైన్యం!

## మిడ్జిల్ నుంచి ముఖ్యమంత్రి పీఠం..

## రెండు దశాబ్దాలుగా అవిశ్రాంత పోరాటం

## రేవంత్ రాజకీయానికి 20 ఏళ్లు పూర్తి

**జడ్పిటిసి గా ప్రస్థానం:** రెండు దశాబ్దాల కిందట రాజకీయ ఎంట్రీ ఇచ్చారు రేవంత్ రెడ్డి. మహబూబ్నగర్ జిల్లా మిడ్జిల్ మండలం నుంచి 2006లో ఒక స్వతంత్ర జడ్పిటిసి సభ్యుడిగా రేవంత్ రెడ్డి ఎన్నికల బరిలో దిగారు. ఆయన తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతారని బహుశా ఎవరూ ఊహించి ఉండరు కూడా. రేవంత్ ఎప్పుడైనా ఆ మాట చెప్పి ఉంటే అందరూ నవ్వుకునేవారు. ఆ ఎన్నికల్లో స్థానిక పెద్దలను,

- మిగతా 2వ పేజీలో



# టిఆర్ఎస్ కుదరదు!

### కవితకు షాక్ ఇచ్చిన భారత ఎన్నికల సంఘం

### తెలంగాణ రక్షణ సేనకు బ్రేక్

### దరఖాస్తు తిరస్కరణ

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాజకీయాల్లో రాణించాలనుకుంటున్న కల్వకుంట్ల కవితకు షాక్ ఇచ్చింది కేంద్ర ఎన్నికల సంఘం. ఆదిలోనే గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆమె దరఖాస్తు చేసుకున్న తెలంగాణ రక్షణ సేన అనే పేరుతో కొత్త రాజకీయ పార్టీని రిజిస్టర్ చేయడం కుదరదని ఈసీ స్పష్టం చేసింది. ఈ మేరకు కవిత పంపిన దరఖాస్తును తిరస్కరిస్తూ..

2లో




## మిడ్జిల్‌లో నాటిన మొక్క ..

# మహావృక్షమైంది

- పేదలకు సేవచేసే భాగ్యం దక్కడం అదృష్టం
- పాలమూరు నుంచి ఎందరో మహానుభావులు వచ్చారు
- పాలమూరు బిడ్డలు పార పట్టగలరు..పాలన చేయగలరు
- మిడ్జిల్ నన్ను భుజానికెత్తుకుని ఆదరించింది
- మిడ్జిల్ మండల అభివృద్ధి బాధ్యత ఇక భట్టిదే
- బిఆర్ఎస్ పాలకులు రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు
- ఆకుటుంబాలకు వేల ఎకరాల ఫామ్‌హౌజ్‌లు ఎలా వచ్చాయి
- మిడ్జిల్ రాజకీయ కృతజ్ఞతా సభలో సిఎం రేవంత్ రెడ్డి

3లో

## రాజకీయాలకు యనమల రామకృష్ణుడు

# గుడ్ బై!

### నర్సీపట్నం నుంచి బరిలోకి రెండో కుమారుడు రాజేష్

### చంద్రబాబు గ్రీన్ సిగ్నల్

### ఇటీవల రాజ్యసభకు పెద్ద కుమారుడు విజయ్

2లో



# బండ్ల గణేష్ ఆస్తి వేలం!

### రుణ ఎగవేతతో చర్యలకు దిగిన యూనియన్ బ్యాంక్

### కోర్టు సైతం ఆదేశాలు

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ కు షాక్ తగిలింది.



2లో

# వర్షాభావ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించండి

- ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను సిద్ధం చేయండి
- రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించండి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్ సంజయ్ జాజు

3లో



# వైసిపిపై బిజెపి గురి!

- భారీగా నేతల చేరిక కు స్కెచ్
- సీఎం రమేష్ కు బాధ్యతలు
- ఫ్యాన్ పార్టీలో ప్రకంపనలు




# 61 ఏళ్ల కంగుంది భూ సమస్యకు ముగింపు

### 322 మంది పేదలకు పట్టాలు పంపిణీ చేసిన సీఎం

### సామాజిక న్యాయంపట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని ముఖ్యమంత్రి వ్యాఖ్య

### ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా భూ వివాదాలు పరిష్కరిస్తాం

### అభివృద్ధి కోసం యజ్ఞం చేస్తుంటే? రాక్షసుల్లా అడ్డుపడుతున్నారు : సీఎం చంద్రబాబు



కుప్పం, జూలై : ఆరు దశాబ్దాలుగా భూమి కోసం ఎదురుచూస్తున్న కంగుంది గ్రామంలోని 322 కుటుంబాల నిరీక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు తెర దించారు. తరతరాలుగా సాగుచేస్తున్న భూములకు

3లో



# టిడిపి ఎమ్మెల్సీ రేస్!

### పదుల సంఖ్యలో ఆశావహులు

### వర్ల రామయ్య, రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డికి ఛాన్స్,?

### చంద్రబాబు కీలక నిర్ణయం

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో రాజ్యసభ ఎన్నికల సందడి మొదలైంది. ఈనెల 28 తో ఇద్దరు ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది.

# మిడ్జిల్‌లో నాటిన మొక్క..మహావృక్షమైంది

మహబూబ్‌నగర్,జూలై4(ఆర్ఎన్ఎ): ఆనాడు మిడ్జిల్ మండల ప్రజలు నాటిన మొక్క ఇవాళ మహా వృక్షమై, ప్రజలకు చేవ చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తొలిసారిగా 2006 జులై 4న మిడ్జిల్ ప్రజలు ఆశీర్వదించారని గుర్తు చేసుకున్నారు. 20 ఏళ్ల రాజకీయ జీవితం పూర్తయిన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో సీఎం మాట్లాడారు. తన రాజకీయ ప్రయాణంలో కీలకమైన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మిడ్జిల్, కల్వకుర్తి ప్రాంతాలకు గతంలోనూ గొప్ప గొప్ప నాయకులు ఉండేవారు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి సీఎంగా చేసిన బూర్గుల రామకృష్ణారావు మహబూబ్‌నగర్ బిడ్డే. ఎంపీగా, కేంద్రమంత్రిగా దేశానికి సేవలందించిన జైపాల్‌రెడ్డి ఈ జిల్లా బిడ్డే. 2006లో జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను ఇక్కడి ప్రజలు అక్కున చేర్చుకున్నారు. నాది ఈ నియోజకవర్గం కాకపోయినా.. నమ్మకంతో గెలిపించారు. మీరు నాపై పెట్టిన నమ్మకమే.. ఇవాళ నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిందని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మండలాలు 2006లో డార్క్ మండలాలుగా ఉండేవి. నా రాజకీయ జీవితంలో కీలకమైన మిడ్జిల్ మండలానికి ఏదైనా చేయాల్సిన బాధ్యత నాపై ఉంది.



ఈ మండలాన్ని దత్తత తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరుతున్నానని ప్రకటించారు. నేను ఏనాడూ పదవి, అధికారాన్ని దుర్వినియోగం చేయలేదు. వందేళ్లుగా కులగణన జరగలేదు. రాష్ట్రంలో కులగణన చేపట్టి దేశానికే దిక్సూచిగా నిలిచాం. దొర దురహంకారాన్ని మరోసారి బొందపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ అన్నను దొర గడీ ముందు గంటల కొద్దీ నిలబెట్టారు. రాష్ట్రంలో పదేళ్లపాటు పేదలకు సొంతింటి కల నెరవేరలేదు. ఈ ప్రభుత్వం గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదల కలను సాకారం చేస్తోంది. రూ.70వేల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని రూ.8.50 లక్షల కోట్ల అప్పుల స్థాయికి దిగజార్చారు. కేసీఆర్ ఏ గ్రామంలోనైనా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారా? మూడెకరాల భూమి ఇచ్చారా? కోటి ఎకరాలకు నీరు ఇచ్చారా?ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? అంటూ ప్రజలను ప్రశ్నించారు. ఇసుక దోపిడీకి అడ్డువచ్చిన నేరెళ్ల దళితులను లారీలతో తొక్కించారు. పదేళ్లు తన కుటుంబానికి, బంధువులకు తప్ప.. ఎవరికైనా ఉద్యోగాలు, పదవులు వచ్చాయా అని అన్నారు. కేసీఆర్ కుటుంబం దోపిడీలు, దొంగతనాలు మళ్లీ మొదలు కావడానికి ప్రజాపాలన పోవాలా? కేసీఆర్‌కు గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చిందన్నారు. కేటీఆర్, కవిత, హరీశ్‌రావుకు రూ.వేల కోట్ల విలువైన భూములు, ఫామ్‌హౌస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మిడ్జిల్ డార్క్ మండల కాదు.. వెలుగు రేఖ అని నిరూపించాలన్నారు. 2006లో జెడ్పీటీసీగా తనపై పోటీ చేసిన రబ్బానీకి ప్రభుత్వ పదవి ఇస్తామని చెప్పారు. పేదల మధ్య పెరిగిన తనకు పేదల కష్టాలు, సమస్యలు తెలుసని అన్నారు. కానీ దొరలకు గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన ఉండదన్నారు. అన్ని గ్రామాల్లో సమస్యలు పరిష్కారమైతే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క,ఎంపి మల్లు రవి, జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైసిపిపై బిజెపి గురి!



(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ పై భారతీయ జనతా పార్టీ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఇక్కడ చేరికలను పెంచాలని చూస్తున్నట్లు సమాచారం. ఆ బాధ్యతను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కు హై కమాండ్ అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఆయన సైతం బిజెపిలో చేరికలు పెరుగుతాయని ప్రకటించడంతో ఏదో జరుగుతోందన్న అనుమానం ప్రారంభం అయింది. ప్రధానంగా వైసీపీలో ఉన్న అసంతృప్త నాయకులను, ద్వితీయ శ్రేణి క్యాడర్ను బిజెపిలోకి రప్పించేందుకు సీఎం రమేష్ రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. మొన్ననే ఆయన పశ్చిమ బెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలను బిజెపి వైపు తిప్పడంలో క్రియాశీలక పాత్ర పోషించారు. అందుకే ఇప్పుడు ఏపీ బాధ్యతలను ఆయనకు హై కమాండ్ అప్పగించింది.

**జనసేన చేరికల కమిటీ..**

జనసేనలో ఇప్పటికే చేరికల కమిటీ ఏర్పాటు అయింది. ఇదంతా ఒక వ్యూహం ప్రకారమేనని తెలుస్తోంది. మిగతా రెండు పార్టీలతో పోల్చుకుంటే టిడిపి బలంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో వైసీపీ నుంచి నేతలను చేర్పించుకుంటే టిడిపిలో విభేదాలు వచ్చే అవకాశం ఉంది. అందుకే వ్యూహాత్మకంగా బిజెపిలోకి వైసీపీ నేతలను చేర్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాయలసీమలో జనసేనలో చేరికల బాధ్యతలను మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డికి అప్పగించారు పవన్ కళ్యాణ్. ఇప్పుడు కోస్తాంధ్రలో బిజెపిలో చేరికల బాధ్యతలను సీఎం రమేష్ చూస్తున్నారు. దీంతో భారీగా వైసీపీ నుంచి జంపింగ్లు ఉంటాయన్న ప్రచారం క్షేత్రస్థాయిలో జరుగుతోంది.

**చర్చలు ప్రారంభం..**

సీఎం రమేష్ అంటే తెలుగుదేశం పార్టీ నాయకత్వానికి అత్యంత దగ్గరగా ఉండే నేత.. గత ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో విపరీతమైన ప్రభావం చూపారు. ఉత్తరాంధ్రలో కూటమి గెలిచేందుకు అవసరమైన వనరులను సమకూర్చారు. అందుకే ఈసారి బిజెపి ఆకర్ష భారీగా ఉండబోతుందన్న టాక్ వినిపిస్తోంది. దాదాపు అన్ని జిల్లాల నుంచి వైసీపీ కీలక నేతల చేరికలు ఉంటాయని బిజెపి వర్గాలు చెబుతున్నాయి. సీఎం రమేష్ ఇప్పటికే ప్రయత్నాలు మొదలు పెట్టారని.. వైసీపీ కీలక నేతలతో చర్చలు జరుపుతున్నారన్న టాక్ నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఈ ప్రచారం ప్రకంపనలు రేపుతోంది.. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# బండ్ల గణేష్ ఆస్తి వేలం!

(మొదటి పేజీ తరువాయి)

న్యాయస్థానంలో భారీ ఎదురు దెబ్బ తగిలింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి కోట్ల రూపాయల మీద రుణాలు తీసుకుని ఎగ్గొట్టారు. దీనితో బండ్ల గణేష్ కుటుంబానికి చెందిన జూబ్లీహిల్స్ లోని ఖరీదైన నివాస ఆస్తులకు వేలం వేశారు. గతంలో ఒకసారి బ్యాంక్ వేలం వేసింది. కానీ దానిని రద్దు చేస్తూ డేట్ రికవరీ ట్రిబ్యునల్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే తాజాగా ఆ ఉత్తర్వులను కొట్టివేస్తూ.. వేలం వేసి డబ్బులు జమ చేసుకోవడం కరెక్ట్ అని న్యాయస్థానం తేల్చి చెప్పింది.

**పౌల్ట్రీ వ్యాపారానికి..**

బండ్ల గణేష్ కుటుంబానిది పౌల్ట్రీ వ్యాపారం. ఆయన తండ్రి నాగేశ్వరరావు, సోదరుడు కలిసి ప్రమోట్ చేసిన శ్రీ పరమేశ్వర పౌల్ట్రీ ఫార్మ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ పేరుతో.. కోళ్ల ఫారాల వ్యాపారాలు కోసం.. యూనియన్ బ్యాంక్ నుంచి దాదాపు రూ.83.16 కోట్లు మేర క్రెడిట్ సదుపాయాలు పొందారు. అది వడ్డీతో కలిసి సుమారు 100 కోట్లకు చేరుకుంది. దీనికి బండ్ల గణేష్, ఆయన తండ్రి పర్సనల్ గ్యారెంటర్లుగా ఉంటూ జూబ్లీహిల్స్ లోని తమ నివాస గృహాలను బ్యాంకుకు తాకట్టుగా చూపారు. అయితే 2017 లోనే ఈ రుణం అకౌంట్ ఎన్పీఏ గా మారింది.. రికవరీ కోసం బ్యాంక్ సర్ఫేసి చట్టం కింద ఆ తాకట్టు ఆస్తిని సుమారు రూ.8.5 కోట్లకు వేలం వేసింది. అయితే దీనిపై డేట్ రికవరీ ట్రిబ్యునల్ స్టే ఇచ్చింది. కానీ ఆ స్టేను కొట్టివేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

**గతంలో ఇటువంటి కేసులే అధికం..**

అయితే బండ్ల గణేష్ కు ఇలాంటి ఆర్థిక లీగల్ చిక్కులు ఎదురు కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో ఆయనపై దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో డజన్ల కొద్దీ చెక్ బౌన్స్ కేసులు నమోదయ్యాయి. ఎన్టీఆర్ హీరోగా ఆయన నిర్మించిన టెంపర్ సినిమా కథ రచయిత వక్కంతం వంశీకి 26 లక్షల రెమ్యూనరేషన్ చెక్కు కూడా బౌన్స్ అయింది. 2017లో హైదరాబాదులోని ఎర్రమంజిల్ కోర్టు బండ్ల గణేష్ కు ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధించింది ఆ కేసులో. 16 లక్షల జరిమానా కూడా విధించింది. అటు తరువాత పర్సనల్ బాండ్లపై ఆయన బెయిల్ పొందారు. ఇదే కాదు కడప జిల్లాకు చెందిన మహేష్ అనే ఫైనాన్షియర్ దగ్గర రూ.13 కోట్ల అప్పు తీసుకుని ఎగ్గొట్టారని కేసులో ప్రొద్దుటూరు,, కడప కోర్టులో ఏకంగా 50కి పైగా చెక్ బౌన్స్ కేసులు ఇతనిపై నమోదయ్యాయి. కోర్టు నోటీసులకు స్పందించకపోవడంతో అప్పట్లో ఆయనను అరెస్టు చేసి కడప కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు పది రోజులపాటు రిమాండ్ కూడా విధించింది. తర్వాత సెటిల్ చేయడంతో బెయిల్ లభించింది. అలాగే ప్రముఖ నిర్మాత పివిపితో కూడా రూ.7 కోట్ల ఆర్థిక వివాదంలో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగిన చరిత్ర బండ్ల గణేష్ కు ఉంది. ఇప్పుడు పెద్ద ఆర్థిక వివాదంలో చెప్పుకోవడం సంచలనంగా మారింది.

# రాజకీయాలకు యనమల రామకృష్ణుడు గుడ్ బై!



(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ రాజకీయాల్లో చింతకాయల అయ్యన్నపాత్రుడుది ప్రత్యేక స్థానం. ఉమ్మడి రాష్ట్రంలోని సీనియర్ మోస్ట్ లీడర్. ప్రస్తుతం ఏపీ శాసనసభ స్పీకర్ గా ఉన్నారు. అయితే వచ్చే ఎన్నికల నుంచి క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై చెబుతానని అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. ఈ తరుణంలో వచ్చే ఎన్నికల్లో నర్సీపట్నం నుంచి పోటీ చేసేది ఎవరు అనే సందిగ్ధం నెలకొంది. ఎందుకంటే ఆయన పెద్ద కుమారుడు చింతకాయల విజయ్ ఇటీవల రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆయన ఆరు సంవత్సరాల పాటు ఆ పదవిలో ఉంటారు. దీంతో అయ్యన్నపాత్రుడు రాజకీయ వారసుడు ఎవరు అనే చర్చ జోరుగా సాగుతోంది.. ఈ తరుణంలో ఆయన రెండో కుమారుడు రాజేష్ వచ్చే ఎన్నికల్లో నర్సీపట్నం నుంచి పోటీ చేస్తారని ప్రచారం నడుస్తోంది.

**చాలా ఏళ్లుగా ప్రాతినిధ్యం..**

నర్సీపట్నం నియోజకవర్గం నుంచి సుదీర్ఘకాలం ప్రాతినిధ్యం వహిస్తూ వస్తున్నారు అయ్యన్నపాత్రుడు. ఎన్టీఆర్ పిలుపుమేరకు తెలుగుదేశం పార్టీలో చేరిన అయ్యన్నపాత్రుడు 1983 నుంచి పోటీ చేస్తూనే ఉన్నారు. 2004 వరకు నర్సీపట్నంలో గెలుస్తూ వచ్చిన ఆయనకు 2009లో మాత్రం బ్రేక్ పడింది. మధ్యలో ఓసారి ఆయన అనకాపల్లి ఎంపీగా కూడా గెలిచారు. ఆ సమయంలో ఎమ్మెల్యే పదవిని వదులుకున్నారు అయ్యన్నపాత్రుడు. 2009, 2019లో మాత్రం ఓటమి చవిచూసారు నర్సీపట్నం నుంచి. తెలుగుదేశం పార్టీ గెలిచిన ప్రతిసారి అయ్యన్నపాత్రుడు మంత్రి అయ్యారు. మొన్న మాత్రం శాసనసభ స్పీకర్ అయ్యారు. అయితే తనకు ఇవే చిట్ట చివరి ఎన్నికలని ప్రకటించారు. అయితే అనూహ్యంగా ఆయన పెద్ద కుమారుడు విజయ్ రాజ్యసభ సభ్యుడయ్యారు.

**అపారమైన పట్టు..**

నర్సీపట్నంలో తిరుగులేని శక్తిగా ఉన్నారు చింతకాయల అయ్యన్నపాత్రుడు. ఆ నియోజకవర్గంలో ఆ కుటుంబానికి పట్టు ఎక్కువ. ఆ కుటుంబాన్ని తప్పించి టికెట్ ఇస్తే ఇబ్బందికరమని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే ఆయన రెండో కుమారుడు రాజేష్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆయన సైతం పోటీకి అన్ని విధాల సిద్ధపడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. రాజ్యసభ సభ్యుడిగా చింతకాయల విజయ్ ఎంపికైన నేపథ్యంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఆ సభ వేదికగా రెండో కుమారుడు రాజేష్ పొలిటికల్ ఎంట్రీ పై స్పష్టమైన సంకేతాలు పంపగలిగారు. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# అతడే ఒక సైన్యం!



పార్టీల లెక్కలను తలకిందులు చేస్తూ సాధించిన విజయం.. ఆయన రాజకీయ ప్రయాణానికి బలమైన పునాది వేసింది. ఆ తరువాత కూడా ఏ పార్టీ మద్దతు లేకుండా 2007లో స్థానిక సంస్థల కోటాలో ఇండిపెండెంట్ ఎమ్మెల్సీగా గెలిచి రికార్డు సృష్టించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ వర్గాల దృష్టిని ఆకర్షించగలిగారు. పరిమిత వనరులతోనే వ్యవస్థలను ఎలా ఎదిరించవచ్చో ఆయన తన తొలి ఇన్నింగ్స్ లోనే నిరూపించుకున్నారు.

**వన్ మ్యాన్ ఆర్మీగా..**

రాజకీయాల్లో రేవంత్ రెడ్డి ప్రయాణం వన్ మ్యాన్ ఆర్మీ లాంటిది. కొడంగల్ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన కాలం నుంచి.. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరే వరకు ఆయన ప్రసంగాల్లోని పదును, ప్రత్యర్థులపై విరుచుకుపడే నైజం ప్రజలను విపరీతంగా ఆకట్టుకుంది. ఓటుకు నోటు కేసు వంటి తీవ్రమైన రాజకీయ సంక్షోభాలు, జైలు జీవితం, సొంత ఇలా కాలు ఘోర పరాజయం వంటి ఎన్నో ఆటంకాలు ఎదురయ్యాయి. అయినా ఎక్కడ వెనుకడుగు వేయలేదు రేవంత్. పరాజయాల నుంచి పాఠాలు నేర్చుకుంటూ.. మరింత కసితో ముందుకు సాగడమే రేవంత్ ఒక సాధారణ నాయకుడి నుంచి మాస్ లీడర్ గా ఎదిగేందుకు దోహదపడింది. అయితే భారత రాష్ట్ర సమితి నేతలు ఆయన టిఆర్ఎస్ లో ఉండే సమయంలో.. హరీష్ రావు వెనుక ఉన్న ఫోటోలు చూపిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటారు. కేవలం వారిలో కించపరచాలని ఉద్దేశం కనిపిస్తుంది. కానీ దాని వెనుక రేవంత్ ఎదిగిన వైనం కనిపిస్తుంది.

**కసితో ఎంపీగా..**

2018 అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ ఓడిపోయారు. కానీ 2019 సార్వత్రిక ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీగా గెలిచి రికార్డు సృష్టించారు. జాతీయస్థాయిలో తన గ్రాఫ్ పెంచుకున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ దాదాపు తుడిచి పెట్టుకుపోయే పరిస్థితుల్లో.. 2021లో హై కమాండ్ ఆయనకు టిపిసిసి బాధ్యతలు అప్పగించింది. పార్టీలోని సీనియర్ల అసంతృప్తి, అంతర్గత కుమ్ములాటలు.. తిరుగులేని శక్తిగా ఉన్న అధికార భారత రాష్ట్ర సమితి.. ఇలా అన్నింటిని అధిగమించి తనదైన దూకుడు రాజకీయంతో క్యాడర్లో సరికొత్త జోష్ నింపారు రేవంత్. క్షేత్రస్థాయిలో పాదయాత్రలు, ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలతో కాంగ్రెస్ శ్రేణులను ఏకం చేసి.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి అఖండ విజయాన్ని చేకూర్చారు.

**స్వశక్తితో ఎదిగి..**

రెండు దశాబ్దాల కాలంలో తన స్వశక్తితో ఎదిగి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. స్వయంకృషి, పట్టుదలను ఆయుధాలుగా మార్చుకుని 2023 డిసెంబర్ 7న తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రెండు దశాబ్దాల రాజకీయ జీవితాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకున్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా తాను పాలమూరు బిడ్డని అంటూ సగర్వంగా చెప్పుకుంటారు రేవంత్. ఈ బ్యాక్ గ్రౌండ్ లేకుండా... కేవలం ప్రజాబలంతో, పోరాటస్ఫూర్తితో ఎదిగిన రేవంత్ ప్రయాణం.. రాజకీయాల్లో రాణించాలనుకునే వారికి ఒక స్ఫూర్తిదాయకం.

# టిఆర్ఎస్ కుదరదు!




సాంకేతిక కారణాల రీత్యా ఈ పేరును కేటాయించలేమని ఎన్నికల సంఘం తేల్చి చెప్పింది. అయితే గులాబీ పార్టీ నుంచి వెళ్లిన భారీ అభ్యంతరాలతోనే ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**టిఆర్ఎస్ సెంటిమెంటుతో..**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేశారు కెసిఆర్. ఉద్యమంతో తెలంగాణను సాధించి.. తెలంగాణ ప్రజల్లో తన ముద్రను చాటుకుంది టిఆర్ఎస్. ఆ సెంటిమెంటును, ఆ క్రేజ్ ను మళ్లీ క్యాష్ చేసుకోవాలనే వ్యూహంతోనే కల్వకుంట్ల కవిత టిఆర్ఎస్ అంటూ తన పేరును ఎంచుకున్నారు. అక్షరమాలపరంగా తెలంగాణ రక్షణ సేన అన్న కూడా టిఆర్ఎస్ వర్తిస్తుంది. క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి సులభంగా వెళ్లవచ్చు అని అంచనా వేశారు. అయితే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం.. గతంలో గుర్తింపు పొందినా.. లేకుంటే ఒక పార్టీకి సుదీర్ఘకాలంగా ఉన్న అక్షరమాల, పేర్లను సమీపంగా పోలి ఉన్నా నిబంధనల ప్రకారం అది కుదరదు. అందుకే ఈసీ దీనిని తిరస్కరించినట్లు తెలుస్తోంది.

**మరో ఆప్షన్..**

తెలంగాణ రాజకీయాల్లో టిఆర్ఎస్ ద్వారా తన అస్తిత్వాన్ని బలంగా చాటుకోవాలనుకున్న కవితకు ఇది షాకింగ్ పరిణామం. ఆమె ఆశించిన పొలిటికల్ మైలేజ్ ప్లాన్ కు ప్రస్తుతం బ్రేక్ పడినట్టే. పేరు తిరస్కరణకు గురైనందున.. ఎన్నికల సంఘం ఆమెకు మరో అవకాశం కల్పించింది. రాబోయే 15 రోజుల్లో చట్ట నిబంధనలకు లోబడి ఉండేలా.. ఇతర పార్టీ పేర్లను పోలివుండని విధంగా మరో మూడు ప్రత్యామ్నాయ పేర్లను ప్రతిపాదించాలని తన ఆదేశాల్లో పేర్కొంది. సెంటిమెంట్ కలిసి వచ్చేలా టిఆర్ఎస్ అక్షరాల చుట్టూనే తన రాజకీయాన్ని తిప్పాలి అనుకున్నారు కవిత. కానీ అది కుదిరే పని కాదని తేలిపోవడంతో ఇప్పుడు కొత్త పేరును ఎంపిక చేసుకునే పనిలో పడ్డారు.




క్రైమ్ మిర్రర్

తెలంగాణ

ఆదివారం

5-7-2026







# సబ్ రిజిస్ట్రార్ అండదండలు...

## ఫోర్జరీ డాక్యుమెంట్లతో ప్లాట్ల రిజిస్ట్రేషన్

### ఫోర్జరీ డాక్యుమెంట్లతో ప్లాట్ల రిజిస్ట్రేషన్ కు తెగబడుతున్న ల్యాండ్ మాఫియా

1992 లోనే ప్లాట్ ల కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ చేసిన భూయజమానులు

ఇప్పుడు... ఖాళీగా ఉన్న ప్లాట్ లకు ఫోర్జరీ పత్రాలను సృష్టించి ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయిస్తున్న భూ మాఫియా...

సబ్ రిజిస్ట్రార్ కు ప్లాట్ కు ఐదు లక్షల చొప్పున ముట్టజెప్పుతున్న భూ మాఫియా

తుర్కయంజాల్ మున్సిపల్ లో 17 ఎకరాలలో వెంచర్ అభివృద్ధి

1992 లోని దాదాపు 225 ప్లాట్లను విక్రయించిన యజమానులు

ఈ వెంచర్ ను అభివృద్ధి చేసిన 16 మంది యజమానులు

ఉమ్మడి ఏపీ లోని ఒక మాజీ మంత్రి తమ్ముడికి తమ ప్లాట్లను జీపీఏ చేసిన తొమ్మిది మంది యజమానులు

జీ పీ ఏ హోల్డర్ తో కుమ్మక్కై ప్లాట్ల యజమానుల నోళ్ళల్లో మట్టి కొడుతున్న భూ మాఫియా

ఏప్రిల్ 15వ తేదీన ప్లాట్ నెంబర్ 57, 234 గజాలు డ్యాక్ మెంట్ నెంబర్ 3685/2026 ను సబ్ రిజిస్ట్రార్ అండదండలతో తొలుత రిజిస్ట్రేషన్

ఆ తరువాత...జూన్ 17 వ తేదీన ఒకే రోజు ఐదు ప్లాట్లను రిజిస్ట్రేషన్

మరో 10 ప్లాట్లను మరి రిజిస్ట్రేషన్ చేయించే విధంగా పన్నాగం

అంతలోనే అసలు బండారం బట్ట బయలు ... ఐదు ప్లాట్ల రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేయించిన భూ మాఫియా

ఇంకా ఒక ఫ్లాట్ రిజిస్ట్రేషన్ యధా తథం

ఫోర్జరీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ పై విజిలెన్స్ కు ఫిర్యాదు చేయనున్న బాధితులు

ఫోర్జరీ డాక్యుమెంట్లతో ప్లాట్ల రిజిస్ట్రేషన్ వెనుక ఓ డాక్యుమెంట్ రైటర్ హస్తం

**గతంలో విక్రయించిన ప్లాట్లనే తిరిగి ఓ సబ్ రిజిస్ట్రార్ అండదండలతో ఫోర్జరీ పత్రాలను సృష్టించి వేరొకరి పేరిట ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయిస్తున్న ఓ భూ మాఫియా గుట్టు రట్టయింది. వివరాలలోకి వెళితే... తుర్కయంజాల్ సర్కిల్ పరిధిలో 1992 లో 16 మంది యజమానులు కలిసి 17 ఎకరాలలో 225 ప్లాట్లతో కూడిన ఓ వెంచర్ అభివృద్ధి చేశారు. అయితే ఇందులో 9 మంది యజమానులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ఓ మంత్రి సోదరుడికి తమ ప్లాట్లను తాకట్టు పెట్టి తమకు అవసరమైన నగదు మొత్తాన్ని అప్పుగా తీసుకున్నారు.**

**( క్రైమ్ మిర్రర్ నిఘా ప్రతినిధి):** దానికి గాను వారు తమకు 16 మంది కి, యజమానులు పంచుకోగా వచ్చిన ప్లాట్లను జిపిఏ చేశారు. ఆ తరువాత తాము తీసుకున్న మొత్తాన్ని ఆనాటి మంత్రి సోదరుడికి అణా పైసలతో సహాతిరిగి చెల్లించి, తమ ప్లాట్లను తాము విక్రయించుకున్నారు. అయితే, ఆ తరువాత అతడికి ఇచ్చిన జిపిఏను క్యాన్సల్ చేయకుండా అలాగే వదిలేశారు. ప్రస్తుతం తుర్కయంజాల్ పరిధిలో ప్లాట్ల ధరలు ఆకాశాన్ని అంటడంతో గతంలో రియల్ ఎస్టేట్ కంపెనీలలో సూపర్వైజర్ గా పనిచేసి, ప్రస్తుతం కోట్లకు పడగలెత్తిన ఒక దళారి 1992 లో చేసిన వెంచర్ లో ఖాళీగా ఉన్న ప్లాట్లపై కన్నేశాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ఓ మంత్రి సోదరుడి పేరిట ఈ ప్లాట్లు ఇంకా జిపిఏ తోనే ఉన్నాయని గ్రహించి, అతడికి ప్లాట్ కు పది లక్షల చొప్పున చెల్లిస్తామని చెప్పి ఒప్పందాన్ని కుదుర్చుకొని, ఒక డ్యాకుమెంట్ రైటర్ సహాయంతో సబ్ రిజిస్ట్రార్ ను మేనేజ్ చేశాడు. తొలుత ఒక ప్లాటు, ఆ తర్వాత మరో ఐదు ప్లాట్లను ఫోర్జరీ పత్రాలను సృష్టించి, ఇతరుల పేరిట సదరు దళారి రిజిస్ట్రేషన్ చేయించాడు. చివరకు మాజీ మంత్రి సోదరుడికి విషయం తెలిసి, ఫోర్జరీ పత్రాలు సృష్టించింది తానే నని, డబుల్ రిజిస్ట్రేషన్ కింద తనపై క్రిమినల్ కేసులు నమోదయ్యే అవకాశం ఉందని భావించి, వెంటనే ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేసిన ఐదు ప్లాట్లు రద్దు చేస్తున్నట్లుగా సబ్ రిజిస్ట్రార్ కు తెలియజేశాడు. సబ్ రిజిస్ట్రార్ సైతం తనకు అందాల్సిన సొమ్ము ముందే అందడంతో, వెంటనే ఆయా ప్లాట్ల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తున్నట్లుగా పేర్కొన్నాడు. అయితే, ఇదే వెంచర్లో ఏప్రిల్ నెలలో ఫోర్జరీ డ్యాక్ మెంట్ల ద్వారా సదరు మాజీ మంత్రి సోదరుడు, రియల్ ఎస్టేట్ దళారి కలిసి రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్ రిజిస్ట్రేషన్ఇప్పటికీ రద్దు కాకపోవడంతో, సబ్ రిజిస్టార్ అడ్డంగా దొరికిపోయాడు. ఈసీ లో ఇతరుల పేరు రాలేదు కాబట్టే తాను రిజిస్ట్రేషన్ చేశానని చెప్పుకుంటున్న సబ్ రిజిస్ట్రార్ తిరిగి తానే ఐదు ప్లాట్ ల రిజిస్ట్రేషన్ లను రద్దు చేశానని పేర్కొనడం హాస్యాస్పదంగా కనిపిస్తోంది. తొమ్మిది మంది యజమానులు గతంలో ఓ మాజీ మంత్రి సోదరుడికి జిపిఏ చేసినప్పటికీ ఇప్పుడు వారిలో ఎంతమంది బ్రతికున్నారో కూడా విచారించకుండా సబ్ రిజిస్టార్ ఆగమేగాల మీద ఆరు ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయడం వెనుక ఆంతర్యం ఏమిటి అన్నది ఇట్టే అర్ధం అవుతుంది. ఒక్కొక్క ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం స్థానికంగా ఉండే ఒక డ్యాకుమెంట్ రైటర్ సహాయంతో ఐదు లక్షల రూపాయల లంచం ముట్ట చెప్పినట్లుగా ఓ వ్యక్తి బాహాటంగానే చెబుతున్నారు. ఈ విషయాన్ని సబ్ రిజిస్టార్ దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ, తాను నిబంధనల మేరకే రిజిస్ట్రేషన్లు చేసినట్లుగా చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉంది. ఒకవేళ జిపిఏ చేసిన వ్యక్తులు చనిపోతే, ఆ జీపీఏ చెల్లదని సబ్ రిజిస్టార్ కు తెలియదా? అని ప్లాట్ల నిజమైన యజమానులు ప్రశ్నిస్తున్నారు. జిపిఏ హోల్డర్ తో కలిసి ఫ్లాట్ల యజమానుల నోట్లో మన్ను కొట్టాలని ప్రయత్నిస్తున్న భూమాఫియా కు అండగా నిలుస్తున్న సబ్ రిజిస్టార్ పై ఏసీబీతోపాటు, విజిలెన్స్ ఎంక్వయిరీ కోరుతూ ప్లాట్ల యజమానులు దరఖాస్తులు చేసుకోవాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది.

**తుర్కయంజాల్ సర్కిల్ పరిధిలో గతంలో అభివృద్ధి చేసిన లేఅవుట్ సర్వే నెంబర్లతో పాటు, రిజిస్ట్రార్ ను మేనేజ్ చేసిన డాక్యుమెంట్ రైటర్ వివరాలతో పాటు, మాజీ మంత్రి సోదరుడు సృష్టించిన ఫోర్జరీ పత్రాలకు సంబంధించిన సమగ్ర ఆధారాలతో వార్త కథనాన్ని తదుపరి ' క్రైమ్ మిర్రర్ దినపత్రిక ' సంచికలో ప్రచురించనున్నాము**

# టిడిపి ఎమ్మెల్సీ రేస్!

గవర్నర్ కోటా కింద ఎంపికైన జాకీయా ఖానం, పండు రవీంద్రబాబు ఈనెల 28 తో పదవీ విరమణ చేయనున్నారు. దీంతో వారి స్థానంలో కొత్త వారి ఎంపిక జరగనుంది. అయితే ఆ రెండు పదవులు తెలుగుదేశం పార్టీ తీసుకోవాలని నిర్ణయించింది. అయితే ఆశావహుల సంఖ్య భారీగా ఉంది. దాదాపు పదిమంది వరకు ఆ పదవులు ఆశిస్తున్నారు. దీంతో ఆ రెండు ఎమ్మెల్సీల ఎంపిక అనేది చంద్రబాబుకు కత్తి మీద సాము.

**పార్టీ కోసం త్యాగం..**

మొన్నటి ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన నేతలు చాలామంది ఉన్నారు. కొందరైతే సీట్లు త్యాగం చేశారు. మరికొందరు పార్టీ కోసం ప్రచారం కూడా చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో సీనియర్లు సైతం నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. రెండు ఎమ్మెల్సీల ఎన్నిక జరగనుండడంతో ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. ప్రధానంగా ఇద్దరి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. రాయలసీమ నుంచి ఒకరికి.. కోస్తాంధ్ర నుంచి మరొకరికి పదవి దక్కుతుందన్న టాక్ వినిపిస్తోంది.

**చాలామంది ఆశావహులు..**

ప్రస్తుతం ఆశావహుల జాబితాలో వంగవీటి రాధాకృష్ణ, బుద్ధ వెంకన్న, దేవినేని ఉమామహేశ్వరరావు, కొమ్మాలపాటి శ్రీధర్, మహాసేన రాజేష్, పిఠాపురం వర్మ.. ఇలా చాలామంది నేతలు ఉన్నారు. వీరంతా పార్టీ కోసం ఎంతగానో కష్టపడ్డారు. ఇందులో పిఠాపురం వర్మతో పాటు దేవినేని ఉమామహేశ్వరరావు తమ సీట్లను కూడా త్యాగం చేశారు. ఆ సమయంలో ఎమ్మెల్సీ తో పాటు రాజ్యసభ హామీ వీరికి దక్కింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న తరుణంలో వీరు తమకు పదవులు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది.

**ఆ ఇద్దరి వైపు మొగ్గు..**

తెలుగుదేశం పార్టీ వర్గాలు చెబుతున్నట్టు... ఒక ఎమ్మెల్సీ పదవి రాయలసీమకు కేటాయిస్తారని తెలుస్తోంది. ప్రధానంగా కడప జిల్లాకు చెందిన రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డికి కేటాయిస్తారని సమాచారం. మొన్ననే రాజ్యసభ పదవిని ఆశించారు. దక్కక పోయేసరికి తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీని నిలబెట్టిన నేతల్లో రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డి ఒకరు. అందుకే ఆయనకు ఛాన్స్ ఇస్తారని తెలుస్తోంది. ఇంకోవైపు వర్ల రామయ్య కు ఈసారి అవకాశం ఉంటుందన్న ప్రచారం సాగుతోంది. పార్టీ కోసం చాలా సిన్సియర్ గా పని చేశారు వర్ల రామయ్య. ఆయన సీనియారిటీ దృష్ట్యా ఈసారి ఆయనకి అవకాశం ఇస్తారని తెలుస్తోంది. చూడాలి మరి చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో..

# వర్షాభావ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించండి

(మొదటి పేజీ తరువాయి)



హైదరాబాద్: తక్కువ వర్షపాతం నమోదైన జిల్లాల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లు సిఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. వర్షభావ పరిస్థితులను అధిగమించేందుకు జిల్లాల వారీగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను తక్షణమే సిద్ధం చేయాలని, దీనివల్ల రైతులకు ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయం, ఆరోగ్యం, సురక్షిత తాగునీరు, విద్యా శాఖల పురోగతిపై సుదీర్ఘంగా సమీక్షించిన ఆయన, రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా జరిగేలా గట్టి నిఘా ఉంచాలని, పంటల వైవిధ్యం పై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో కాలానుగుణ వ్యాధుల నివారణకు వివిధ శాఖల మధ్య సమన్వయం తప్పనిసరని సీఎస్ స్పష్టం చేశారు. పారిశుధ్యం, దోమల నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపడుతూనే, వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని, విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా కొరత లేకుండా సురక్షిత తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. విద్యా శాఖకు సంబంధించి, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటశాలలకు అనువైన స్థలాలను గుర్తించి, అక్కడ మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రాధాన్యతా అంశాలన్నింటినీ కలెక్టర్లు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, నిరంతర సమీక్షలు జరపాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

# 61 ఏళ్ల కంగుంది భూ సమస్యకు ముగింపు

అధికారిక హక్కు పత్రాలు అందుకోవడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. కుప్పం నియోజకవర్గంలోని కంగుందిలో నిర్వహించిన డీకేటీ పట్టాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 460.19 ఎకరాల భూమికి సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. పట్టాల పంపిణీకి సంబంధించి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. 61 సంవత్సరాలుగా పరిష్కారం కాకుండా గ్రామస్థులను వేధిస్తున్న భూ సమస్యను సమగ్ర రికార్డుల పరిశీలన, వివిధ కోణాల్లో అధ్యయనం చేసి పరిష్కరించినట్లు తెలిపారు. అడవి పొరంబోకు భూమిని అసైన్డ్ వేస్ట్ డ్రై భూమిగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తీసుకుని రైతులకు భూములు అందించినట్లు చెప్పారు. పేదలకు పట్టాల పంపిణీ సంతోషంగా ఉందిరైతుల పక్షాన న్యాయం ఉండటంతోనే ఈ సమస్యను పరిష్కరించగలిగామని పేర్కొన్న సీఎం, 322 మంది రైతులకు 460.19 ఎకరాల భూమిని పట్టాల రూపంలో ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని చెప్పారు.




క్రైమ్ మిర్రర్

# ఎడిటోరియల్

4

ఆదివారం

5-7-2026



## కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్యకు ఘన నివాళి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** జిల్లెలగూడ కురుమ సంఘం ఆధ్వర్యంలో అమరజీవి దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, తొలి అమరజీవి దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సందర్భంగా జిల్లెలగూడ కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన తెలంగాణ రైతాంగ హక్కుల కోసం చేసిన పోరాటం, ఆయన త్యాగం భావితరాలకు ఆదర్శమని, సమాజంలో న్యాయం, సమానత్వం కోసం ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సిద్ధాల లార్డ్స్ బీరప్ప, సిద్ధాల అంజయ్య, సిద్ధాల ఆగమయ్య, దొడ్డి కొమరయ్య కమిట్టి అధ్యక్షులు సిద్ధాల మహేష్, సిద్ధాల కృష్ణ, సిద్ధాల శ్రీనివాస్ సిద్ధాల శ్రీశైలం సిద్ధాల దినేష్ తదితరులు పాల్గొని అమరజీవి దొడ్డి కొమరయ్యకు నివాళులర్పించారు.

## రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన మిర్యాలగూడ క్రీడాకారులు



మిర్యాలగూడ, జూలై 5 (క్రైమ్ మిర్రర్): నూకల చారిటబుల్ ట్రస్ట్ పాటు ఎన్‌వీఆర్, బీఎల్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు నెల రోజుల పాటు ఖోఖోతో పాటు వివిధ క్రీడల్లో శిక్షణ అందించారు. అనంతరం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో 32 జట్లు పాల్గొనగా, మిర్యాలగూడ జట్టు ప్రతిభ కనబర్చి మూడో స్థానం సాధించింది. ఈ సందర్భంగా నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో ఆర్. వినీత చక్ర విసిరే పోటీలో బంగారు పతకం సాధించింది. అలాగే కే. రూప, మధుబాను, లహరి, రియాజ్, అభి సాయి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై మిర్యాలగూడకు గుర్తింపు తీసుకొచ్చారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి సన్మానించి అభినందించారు. అలాగే ఈ శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్‌వీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నూకల వేణుగోపాల్ రెడ్డి, బీఎల్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, వారి బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ అజారుద్దీన్, 25వ వార్డు కాంగ్రెస్ బాధ్యురాలు గోదాల జానకి, యువజన కాంగ్రెస్ నాయకుడు గడగోజు అశోక్ చారి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కోదాటి అనిల్, నామ రవీందర్, శిక్షకులు సతీష్, నాగరాజు, లక్ష్మణ్, గడగోజు అశోక్ చారి, బీఎల్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 80 వ.వర్ధంతి


### పూలమాల వేసి ఘన నివాళ్ళు అర్పించిన నాయకులు



మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు కామ్రేడ్ దొడ్డి కొమరయ్య 80వ. వర్ధంతిని మహేశ్వరం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..దొడ్డి కొమురయ్య భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం మట్టి మనుషులను ఏకం చేసి ఆంధ్ర మహాసభలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు ఈ కార్యక్రమంలో సిపిఐ మహేశ్వరం నియోజకవర్గ కార్యదర్శి బి.దత్తు నాయక్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు కర్రోల చంద్రయ్య, మహేశ్వరం ఉపసర్పంచ్ జోరాల రమేష్, బాలరాజు,సురేష్ యాదగిరి పరమేష్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మనసు చదవని మనిషి కథ!

**చేతిలో ఓ అద్భుతమైన పుస్తకం ఉంది. రంగురంగుల అట్టలు, లోపల అమూల్యమైన అక్షరాల నిధులు. కానీ, దాన్ని ఒక్కసారి కూడా తెరవకుండా, ఆ అందమైన అల్మారాలో ఒక మూలన పడేస్తే ఎంత విచారకరం? నేటి ఆధునిక మనిషి తన సొంత జీవితాన్ని కూడా సరిగ్గా ఇలాగే గడిపేస్తున్నాడు. పుట్టిన క్షణం నుండి తుది శ్వాస విడిచే వరకు ప్రతి ఒక్కరి జీవితం ఒక అద్భుతమైన నవల, ఒక అపురూపమైన కావ్య సృష్టి. అందులో నవరసాలు ఉన్నాయి, భావోద్వేగాల ప్రవాహాలు ఉన్నాయి, గెలుపోటముల మలుపులు ఉన్నాయి. కానీ, ఈ బిజీ ప్రపంచంలో ఈ కథను ఎంతమంది మనస్ఫూర్తిగా చదువుతున్నారు? ఎంతమంది ఆ పేజీల మధ్య ఆగి, ఆలోచించి, ఆ అనుభూతిని గుండెల్లో నింపుకుంటున్నారు? ఉదయం అలారం మోగడంతోనే మొదలయ్యే పరుగు, రాత్రి మళ్లీ కళ్లు మూసేంత వరకు ఓ నిరంతర యుద్ధంలా సాగుతూనే ఉంటుంది.**





డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

ఆఫీసు ఫైళ్లు, డెడ్‌లైన్లు, బ్యాంక్ బ్యాలెన్స్‌లు, సామాజిక బాధ్యతలుఇవే జీవిత పరమార్థం అనుకుంటూ మనిషి రోబోలా మారిపోతున్నాడు. ఈ క్రమంలో తన చుట్టూ ఉన్న చిన్న చిన్న అద్భుతాలను గమనించడమే మానేశాడు. ఉదయాన్నే కిటికీ పక్కన పిట్టల కిలకిలారావాలు వినిపించినా, వాటిని ఆస్వాదించే ఓపిక నేటి తరానికి లేదు. సాయంత్రం వేళ సూర్యాస్తమయం ఆకాశపు కాన్వాస్‌పై రంగుల జాతర చేస్తున్నా, కళ్లు పైకెత్తి చూసే తీరిక లేదు. ఇంట్లో పిల్లల అమాయకపు నవ్వులు, ముసలి తల్లిదండ్రులు పంచుకునే పాత జ్ఞాపకాల ముచ్చట్లు, ప్రాణస్నేహితుడి ఆత్మీయ పలకరింపులుఇవన్నీ జీవితం అనే పుస్తకంలో సువర్ణ అక్షరాలతో రాసిన వాక్యాలు. కానీ, మనిషి వాటన్నింటినీ దాటేసి, కేవలం ఐదు అంగుళాల స్మార్ట్‌ఫోన్ తెరపైనే తన దృష్టిని కేంద్రీకరిస్తూ ముందుకు సాగిపోతున్నాడు. నిజానికి జీవితం ఒక సుదీర్ఘమైన ధారావాహిక లాంటిది. ఇక్కడ ప్రతి రోజు ఒక కొత్త అధ్యాయం, ప్రతి అనుభవం ఒక రసవత్తరమైన మలుపు. కష్టాలు వచ్చినప్పుడు కథలో ఉత్కంఠ పెరుగుతుంది, సంతోషాలు వెల్లివిరిసినప్పుడు మనసు తేలికపడుతుంది. అయితే ఈ కథను ఆస్వాదించే ఓపిక లేక, మనిషి దీన్ని ఎంత తొందరగా ముగిస్తే అంత మంచిదన్నట్లు, తదుపరి అధ్యాయం కోసం పరుగులు తీస్తున్నాడు. ఫలితంగా, అత్యంత విలువైన వర్తమానం ఇసుకలా చేజారిపోతోంది. నేడు మనిషి చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్ ప్రపంచాన్నంతా అరచేతిలోకి తెచ్చి పెడుతోంది. కానీ, దురదృష్టవశాత్తూ పక్కనే కూర్చున్న తోటి మనిషిని మాత్రం చూడనివ్వడం లేదు. సోషల్ మీడియా ఖాతాల్లో వేలమంది ఫ్రెండ్స్ లైకులు కొడుతుంటారు, కానీ అర్ధరాత్రి వేళ మనసు విప్పి బాధను పంచుకుందామంటే ఒక్క నిజమైన స్నేహితుడు కూడా కనిపించని పరిస్థితి. ప్రతి క్షణాన్ని కెమెరాలో బంధించి, అందరికీ ప్రదర్శించాలనే ఆరాటంలో, ఆ క్షణాన్ని కళ్లారా చూసి, మనసారా అనుభవించడం మర్చిపోతున్నాడు. ఒక అందమైన జలపాతాన్ని లేదా సూర్యోదయాన్ని చూసినప్పుడు, ఆ ప్రకృతి నిశ్శబ్దాన్ని ఆస్వాదించడం కంటే, ముందుగా ఫోన్ కెమెరా ఆన్ చేయడమే ఆధునిక మనిషికి అలవాటైన మొదటి విద్యగా మారింది. ప్రపంచంలో ఎక్కడో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి గంటల తరబడి సమయం వెచ్చించే మనిషి, అసలు తన లోపల ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి రోజుకు ఐదు నిమిషాలు కూడా కేటాయించడం లేదు. తన అసలైన సంతోషాలు ఏమిటి, తనను వేధిస్తున్న బాధలు ఏంటి, తన అంతరాత్మ కోరుకుంటున్న కలలు ఏమిటి అని గుండెపై చేయి వేసుకుని ఆలోచించే తీరికే లేకుండా పోయింది

అమ్మ చేతి వేడి వేడి వంటకాల రుచి, నాన్న ఇచ్చే చిన్న సలహా వెనుక దాగున్న అనంతమైన ప్రేమ, పాత స్నేహితుడి భుజంపై చేయి వేసి నవ్విన నవ్వు, మొదటి వర్షపు జల్లుల్లో తడిసినప్పటి ఆ మట్టి వాసనఇవన్నీ చాలా చిన్న విషయాలుగా అనిపించవచ్చు. కానీ, జీవితం అనే సుదీర్ఘ ప్రయాణంలో ఇవే అత్యంత కాంతివంతమైన పేజీలు.

సమాజం నిర్దేశించిన పెద్ద పెద్ద లక్ష్యాల వెనుక, లగ్జరీ కార్లు, బంగ్లాల వెనుక పరుగెత్తుతూ ఈ సహజసిద్ధమైన సంతోషాలను మనిషి తృణీకరిస్తున్నాడు. రేపటి కోసం ఈ రోజును బలి ఇస్తున్నాడు. తీరా ఆ రేపు వచ్చినప్పుడు కూడా అదే పరుగు, అదే యాంత్రికత రిపీట్ అవుతూనే ఉంటుంది. వృద్ధాప్యంలోనో, లేదా జీవితపు చివరి అంచుల్లోనో వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు మాత్రమే చాలామందికి ఒక చేదైన నిజం బోధపడుతుంది. తాము సంపాదించిన కోట్ల డబ్బు కంటే, పంచుకున్న కొద్దిపాటి ప్రేమే ఎక్కువ విలువైనదని, సాధించిన హోదాల కంటే ఆత్మీయులతో గడిపిన సమయమే గొప్పదని అప్పుడు తెలుసుకుంటారు. కానీ, అప్పటికే జీవితంలోని ముఖ్యమైన పేజీలన్నీ తిరగేయడం అయిపోతుంది, మళ్లీ వెనక్కి వెళ్లి చదవడానికి సమయం అస్సలు మిగలదు. అయితే, కాలం ఇంకా మించిపోలేదు. జీవితం అనే ఈ అద్భుతమైన కథను మళ్లీ మొదటి నుండి శ్రద్ధగా చదవడం ప్రారంభించడానికి ఎప్పుడూ ఆలస్యం కాదు. రోజువారీ బిజీ లైఫ్ నుండి ప్రతి రోజు కొన్ని నిమిషాలైనా విరామం తీసుకుని, మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని నిదానంగా గమనించడం నేర్చుకోవాలి. రోజులో కొంత సమయం ఫోన్‌ను పక్కన పెట్టి, కుటుంబ సభ్యుల కళ్లల్లోకి చూస్తూ మాట్లాడండి. కాసేపు కాంక్రీట్ వనాన్ని విడిచి, పచ్చని ప్రకృతిలో నడుస్తూ, చల్లని గాలి స్పర్శను ఆస్వాదించండి. వారంలో ఒక్కసారైనా మీతో మీరు మాట్లాడుకోండి, మీ మనసుకు నచ్చిన పని చేయండి. జీవితం అనేది అందరికంటే ముందుగా ముగించాల్సిన రేస్ కాదు, అది అడుగడుగునా ఆస్వాదించాల్సిన ఒక సుందరమైన యాత్ర. ఇందులోని ప్రతి అధ్యాయంలో ఒక పాఠం ఉంది, ప్రతి పాత్రలో ఒక కొత్త అనుభవం దాగుంది. ఈ కథను మనం ఎప్పుడైతే శ్రద్ధగా, ప్రేమతో చదువుతామో, అప్పుడే జీవితం మనకు అందించే అసలైన పరమార్థం బోధపడుతుంది. లేకపోతే, పుస్తకం చేతిలో ఉండి కూడా చదవలేకపోయిన అభాగ్యుల్లా, భూమిపై జన్మించి కూడా జీవితాన్ని జీవించకుండానే వెళ్లినవారిగా మిగిలిపోతాం. అందుకే, ఈ క్షణం నుంచే కాస్త నిదానించి ఆలోచిద్దాం నా జీవితమనే కథను నేను నిజంగా చదువుతున్నానా, లేదా కేవలం పేజీలు తిప్పుతూ కాలం వెళ్లదీస్తున్నానా? ఈ ప్రశ్నకు మీ అంతరాత్మ ఇచ్చే సమాధానమే, మిమ్మల్ని అసలైన జీవనం వైపు నడిపించే మొదటి అడుగు అవుతుంది.

# సర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలే సహకరించాలి!

**సర్ ప్రక్రియతో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు కంగారు పడుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా ఉన్న మద్దతుదారుల ఓట్లు పోతాయన్న భావనలో ఉన్నారు. ముఖ్యంగా ఆంధ్రావారిలో చాలామందికి తెలంగాణలో ఓటు ఉంది. దీనిపై వారు ఆందోళన చెందుతున్నారు. రెండు ఓట్లు ఉంటే తొలగించడం ఖాయం. అలాగే హైదరాబాద్,విజయవాడ లాంటి తదితర పట్టణాల్లో ఉన్నవారికి కూడా అటు సొంతూళ్లు, ఇక్కడా ఓట్లు ఉన్నాయి. వీటిని తొలగిస్తే ఎలా అన్న ఆందోళనలో ఉన్నారు. అన్నింటికి మించి పాతబస్తీ లోనే ఎక్కువ గందరగోళం కనిపిస్తోంది. ఇక్కడ తిష్టవేసిన రోహింగ్యాలతో పాటు, ఇతర దేశాల వారిని గుర్తించడం కొంచెం కష్టమే. ఇకపోతే అధికారులు రోజువారీ సమీక్ష చేస్తూ సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఎలాంటి పొరపాట్లు రాలేదు. నకిలీ ఓట్లను నిరోధించేందుకు పక్కాగా ఓ వ్యవస్థ అంటూ లేదు. ఆధార్, పాన్ కార్డులకు పర్మినెంట్ నంబర్ ఉంటోంది. కానీ ఓటుకు అలాంటిదేమీ లేదు. అలాంటి పక్కా వ్యవస్త ఉంటే తప్ప ఎన్నిసార్లు సర్ ప్రక్రియ చేపట్టినా నకిలీ ఓట్లు తొలగింపు అసాధ్యమే. ఇకపోతే ఇల్లుమారిన లేదా, చనిపోయిన వారి ఓట్లను ఎలా తొలగిస్తారన్నది కూడా ప్రశ్నే. ఇదిలావుంటే అన్ని రాజకీయ పార్టీలు సమావేశాలు పెట్టి తమ కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నాయి.**

ఓట్లు తొలగిపోకుండా చూడాలని జాగ్రత్తలు చెబుతున్నాయి. అందుకు బూత్‌లెవల్లో శిక్షణ కూడా ఇచ్చారు. ఓ వైపు ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే సమావేశాలు కొనసాగుతున్నాయి. దీనిని బట్టి రాజకీయ పార్టీల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. నకిలీ ఓట్లను తొలగించే విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం సర్ ద్వారా గత కొన్నేళ్లుగా సంస్కరిస్తోంది. ఇది కొత్తగా బిజెపి ఏలుబడిలో తీసుకువచ్చిందేమీ కాదు. గతంలో యూపిఎ హయాంలోనూ సర్ ప్రక్రియ సాగింది. అయితే అప్పట్లో తూతమంత్రంగా సాగడంతో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. 'సర్' పక్రియ చట్టబద్ధమేనని, కానీ వాటి కోసం అవలంబించే పద్ధతుల్లో మార్పులు తెచ్చుకోవాలని ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం అన్ని రాజకీయ పార్టీలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి హితవు చెప్పింది. ఓటు హక్కు ఒకటే యువత భవిష్యత్‌ను నిర్మించుకునేందుకు ఉన్న ఏకైక ఆయుధమని నమ్ముతుంటాం. ఓటు ఉంటేనే నేతలు ఉంటారు. అధికారం ఉంటుంది. అందుకే ఓట్ల కోసం అభ్యర్థులు, పార్టీలు డబ్బులు విరజిమ్మడం ద్వారా అధికార పీఠం దక్కించుకునేందుకు నానా గడ్డీ కరుస్తుంటారు. ఇప్పుడు సర్ ప్రక్రియ ద్వారా తమవారి ఓట్లు పోకుండా జాగ్రత్త పడడం ఇందులో భాగమే. ప్రజాస్వామ్యంలో ధనస్వామ్యం చొరబడిన తరవాత ప్రజాస్వామ్యం ఇప్పుడు వికటిస్తున్నది. ఈ పరిస్థితుల్లో 'ఓటు' దుర్వినియోగం అవుతోంది. డబ్బులు పెట్టి ఓట్లు కొనసడం అలవాటు చేసుకున్నారు. దొంగ ఓట్లతో జాతర నడిపిస్తున్నారు. స్థానికంగా లేని వారికి ఓటు హక్కు కల్పించడం, ఆ ఓటును ఎవరో వేసేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సర్' పేరుతో అసలుసిసలు ఓటర్లను జాబితాలోంచి తీసేస్తున్నారన్న ఆరోపణల మధ్య రాజకీయ పార్టీలు ఓట్లను దక్కించుకునేందుకు జాగ్రత్త పడుతున్నాయి. బీహార్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, తదితర రాష్ట్రాలకు సర్ ప్రక్రియ పూర్తయిన తరవాతనే ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల ప్రభుత్వాలు మారడంతో ఓట్లను తొలగిస్తున్నారన్న ప్రచారం చేపట్టారు. ఇంత ప్రక్షాళన జరిగినా కొన్ని చోట్ల అక్రమంగా తమ ఓట్లు తొలగించారన్న ఆవేదనలు వినిపిస్తూనే ఉన్నాయి. సాధారణ పౌరులెవరికీ 'సర్' పట్ల ఎలాంటి అసంతృప్తి లేదు. ఈ పక్రియలో ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందిన ఓటర్లు కూడా ఇప్పుడు ఒక్కక్కరూ ఆందోళన చెందుతున్నారు. ఏ వ్యవస్థలో అయినా లోపభూయిష్టమైన విధానాలకు చెక్ పెట్టాల్సిందే. ఓటు ఉన్నవారు నిర్భయమంగా ఉండాల్సిందే. ఎలాంటి ఆందోళనలు అవసరం లేదు.

ఎన్నికల సంఘం కూడా అలాంటి వారిని ఎక్కడా తప్పు పట్టడం లేదు. జాబితాలో తొలగించడం లేదు.

అవగాహన లేనివారు మాత్రమే ఆందోళనతో అయోమయంలో పడిపోతున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ఎంతో విశ్వసనీయత కలిగి ఉండటం అవసరం. రెండు ఓట్లు, ఇక్కడ లేని వారి ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తొలగించేందుకు ఇసికి రాజకీయ పార్టీలు సహకరిస్తే సమస్య సులువుగా పరిష్కారం అవుతుంది. కానీ రాజకీయా పార్టీలు అలా చేయడం లేదు. రాజకీయ పార్టీల చర్యలు ఓటర్లలోనూ గందరగోళంలఅఒ పడేసేలా ఉంటోంది. ఓట్లు పోతాయంటూ చేస్తున్న హెచ్చరికలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు తమ ఓటు ఎక్కడ పోతుందో అన్న ఆందోళన చెందుతున్నారు. శాశ్వతంగా ఒకే ప్రాంతంలో నివసించే వారిఓట్ల జోలికి ఇసి వెళ్లడం లేదు. కొన్ని చోట్ల తాము వెళ్లినప్పుడు ఓటర్లు అక్కడ లేకపోవడం, తగిన కారణాలు చూపక పోవడంతో తొలగించడం జరుగుతోంది. ఇంటింటికీ వెళ్లి ధృవీకరణద్వారా జాబితాను జల్లెడ పడుతున్నారు. ఒకటి కన్నాఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదై, వారు మరో చోట నివసిస్తుంటే వారి ఓటు హక్కు ఆ ప్రాంతానికే మార్చుకోవాలి. ఎక్కడ శాశ్వత నివాసం ఉంటుందో అక్కడే ఓటును పొందాలి. అంతేగానీ పలుచోట్ల ఓటును కలిగి ఉండడం కూడా నేరం. ఇలాంటి విషయాలను రాజకీయా పార్టీలు ప్రచారం చేయడం లేదు. రాజకీయ ఎత్తుగడ కోసం ఓట్లు తొలగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నాయి. 'సర్' పూర్తిగా చట్టబద్ధమైన పారదర్శక పక్రియ అనడంలో సందేహమే లేదు. కేంద్ర ఎన్నికల సంఘం తరచు సమీక్షలు చేయడం ద్వారా ఓటర్ల గుర్తింపునకు వెసులు బాటుగా అవగాహన కల్పించడం, వారి ఓటుకు చోటు లభించేటట్లు చేయడం అత్యంతావశ్యకం. అవగాహనలోపం వల్ల అర్హులైన ఓటర్లు కూడా తమ 'ఓటుహక్కును దక్కించుకోవడం కోసం అజాగ్రత్తగా ఉండరాదు. రాజకీయ పార్టీలు గ్రామాల వారీగా జాబితాలు ముందుర వేసుకుంటే ఎవరు స్థానికులో ఎవరు కాదో తెలుస్తుంది. ఎవరు ఓటరో కాదో తెలుస్తుంది. చనిపోయిన వారు ఎవరో కూడా వారికి తెలుసు. ఇలాంటి విషయాల్లో ఆయా పార్టీలు నేరుగా ఎన్నికల సంఘానికి సహకరించి, అనర్హత కలిగిన ఓట్లను తొలగించాలి. అప్పుడే ఓటరు సమగ్ర జాబితా రూపొందగలదు.

# ఘనంగా భాష్యం వి.వి.ఎన్ స్కూల్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు

**కొత్త విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం**

**సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి**

**విద్యలో రాణించాలని యాజమాన్యం పిలుపు**




**కూకట్ పల్లి, జూలై 04 (క్రైమ్ మిర్రర్):** శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్‌లోని భాష్యం వి.వి.ఎన్ స్కూల్లో నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు విద్యార్థుల ఉత్సాహం, ఆనందోత్సాహాల మధ్య అత్యంత ఘనంగా జరిగాయి. కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు చిరస్మరణీయ అనుభూతిని మిగిల్చింది. కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం కొత్త విద్యార్థులను సీనియర్ విద్యార్థులు పుష్పగుచ్ఛాలు అందించి, అభినందనలతో ఆహ్వానించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొత్త వాతావరణంలో అడుగు ఎట్టిన చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఆకట్టుకునే నృత్యాలు, మధురమైన గాన ప్రదర్శనలు, వినోదాత్మక స్కిట్లు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. చిన్నారుల ప్రతిభ, వేదికపై వారి ఆత్మవిశ్వాసం అందరినీ ఆకట్టుకోగా, సభ అంతా చప్పట్లతో మార్మోగింది. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థిని పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ వేడుకలకు సీఈఓ చైతన్య, జెడ్ఈఓ శిరీష, ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయ బృందం ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల ప్రదర్శనలను ప్రశంసిస్తూ, పాఠశాలలో విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జెడ్ఈఓ శిరీష మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, సృజనాత్మకతను అలవర్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పాఠశాల అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేయాలని ప్రోత్సహించారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ, కొత్త విద్యార్థులు ఎలాంటి సంకోచం లేకుండా ఉపాధ్యాయులను సంప్రదిస్తూ విద్యాభ్యాసంలో ముందుకు సాగాలని సూచించారు. పాఠశాలలో విద్యతో పాటు నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతలను కూడా పెంపొందించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికితీసి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు పాఠశాల కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు కొత్త విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి అడుగులోనూ వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సీనియర్ విద్యార్థులు కూడా కొత్త స్నేహితులతో కలసి ఆనందంగా గడుపుతూ స్నేహబంధాలను మరింత బలోపేతం చేశారు. ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగిన ఈ ఫ్రెషర్స్ డే వేడుకలు కొత్త విద్యార్థులకు చిరస్మరణీయ అనుభూతిని అందించడమే కాకుండా, కొత్త విద్యా సంవత్సరానికి శుభారంభంగా నిలిచాయి. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఉత్సాహాన్ని నింపుతూ, విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి పునాది వేసిన ఈ కార్యక్రమాన్ని హాజరైన వారందరూ అభినందించారు.



# స్వాతంత్ర పోరాటంలో అల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలు మరువలేనివి

**కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి**

**కుత్బుల్లాపూర్, జూలై 04 (క్రైమ్ మిర్రర్) :** భారతీయులలో స్వాతంత్ర్య కాంక్షకు స్ఫూర్తినిచ్చిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, ప్రగతి నగర్ డివిజన్ లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి, ప్రగతినగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి, బండారు లేఔట్ డివిజన్ అధ్యక్షులు వరగాని వాసు, నిజాంపేట్ డివిజన్ అధ్యక్షులు కోటపాటి మురళి, సీనియర్ నాయకులు తులసిదాస్, గూడూరు మురళి కృష్ణ, డా. మద్ది నారాయణ రెడ్డి, బత్తుల చిరంజీవి, ప్రశాంత్ రెడ్డి, దాసరి మహేష్, పుచ్చకాయల సాంబాశివరావు, పాటిబండ్ల హరిష్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్



**కూకట్ పల్లి, జూలై 04 (క్రైమ్ మిర్రర్) :** మాజీ ఎమ్మెల్యే, ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా 79వ జయంతి సందర్భంగా శనివారం కేపీహెచ్‌బీ టెంపుల్ బస్ స్టాప్ వద్ద ఘనంగా నిర్వహించిన జయంతి వేడుకలకు తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మోహనరంగా ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. సమాజ సేవ, ధైర్యసాహసాలు, ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో కూకట్ పల్లి ఏఎంసీ చైర్మన్ పుష్ప రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, నాయకులు గంధం రాజు, రంగమోహన్, కరుణాకర్, భరత్, అరవింద్ రెడ్డి, కిలారు శ్రీనివాస్ బాబు, రాజేష్ గౌడ్, నళిని కాంత్, బాలరాజు, రాము, నవీన్, కామినేని వాసు, వనజ, సుజాత, వాణి, అరుణ్ స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని మోహనరంగా కి ఘన నివాళులు అర్పించారు.

# ట్రాక్టర్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి



**పెబ్బేరు జూలై 04 క్రైమ్ మిర్రర్:** పెబ్బేరు మండల పరిధిలోని శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన పెబ్బేరు మండల పరిధిలోని బునియాదిపురం శివారులో చోటు చేసుకుంది. రెండో ఎస్ఐ దివ్యారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పాత సూగురు గ్రామానికి చెందిన చనమోని శ్రీనివాసులు (46) పెబ్బేరు నుంచి పాత సూగురు గ్రామానికి బైక్ పై వెళ్తుండగా బునియాదిపురం నుంచి పెబ్బేరు వైపు వస్తున్న (టూ32ఏ0541)గల ట్రాక్టర్ అదుపు తప్పి శ్రీనివాసులును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గోవిందమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దివ్యారెడ్డి తెలిపారు

# పోలీసులకు ఆర్థిక నిర్వహణపై అవగాహన సదస్సు





**సైబర్ నేరగాళ్లు ఓటీపీలు, బ్యాంకు వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దు**

**డిజిటల్ లావాదేవీల్లో అప్రమత్తంగా ఉండాలి**

**అనుమానం వస్తే బ్యాంకు, పోలీసులను సంప్రదించండి**


**బాలానగర్ ఏసిపి పింగిలి నరేష్ రెడ్డి**

**కూకట్ పల్లి, జూలై 04 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి ఎన్ కెఎన్ఆర్ గార్డెన్స్ లో పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం ఆర్థిక నిర్వహణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలానగర్ డీసీపీ రితీరాజ్ సూచన మేరకు కూకట్‌పల్లి సీఐ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి, ఆర్థిక నిపుణుడు శ్రీధర్ రావు పాల్గొన్నారు. పోలీసు సిబ్బందికి స్మార్ట్ ఫైనాన్షియల్ ప్లానింగ్, పొదుపు, పెట్టుబడులు, ఆర్థిక మోసాల నివారణపై వారు అవగాహన కల్పించారు. జీతంలో కొంత భాగాన్ని తప్పనిసరిగా పొదుపు చేయాలని, అనవసర అప్పులు, అధిక వడ్డీలకు ఆశపడి మోసపోవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఓటీపీలు, బ్యాంకు వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దని హెచ్చరించారు. డిజిటల్ లావాదేవీల్లో అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే వెంటనే బ్యాంకు లేదా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. ఈ సదస్సులో కూకట్‌పల్లి, బాలానగర్, అల్లాపూర్ పోలీస్ స్టేషన్ల ఎస్ హెచ్ ఓ లు, డి ఐలు, ఎస్సై లు, బాలానగర్ డివిజన్ పోలీసులు, ట్రాఫిక్ విభాగం, ఏ ఆర్ ఫోర్స్ కు చెందిన 125 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇప్పర్తిలో వైభవంగా శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

**కుంభాభిషేకంలోపాల్గొన్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

**మనోహర్ రెడ్డి, చలమల్ల కృష్ణారెడ్డి, వర్షిత్ రెడ్డి ,ప్రముఖులు**



**మునుగోడు క్రైమ్ మిర్రర్, జూలై 4:** మునుగోడు మండల పరిధిలోని ఇప్పర్తి గ్రామంలో శనివారం శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థాన ప్రతిష్టాపన మహోత్సవం కన్నులపండువగా జరిగింది. బిజెపి నాయకులు గోలి లింగస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో శ్రీ అభయాంజనేయ స్వామి నూతన విగ్రహ ఆవిష్కరణ, కుంభాభిషేక మహోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించి, గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపారు..ఆంజనేయ స్వామి కృపతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. మునుగోడు ఎస్సై ఇరుగు రవి కుమార్, తహశీల్దార్ నేలపట్ల నరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వట్టికోటి శేఖర్, బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య తదితరులు పాల్గొన్నారు. పూజ కార్యక్రమాల అనంతరం గోలి లింగస్వామి ఆధ్వర్యములో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

# టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తన్నీరు శ్రీనివాస్



**కుత్బుల్లాపూర్, జూలై 04 (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టిడబ్ల్యూజేఎఫ్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కుత్బుల్లాపూర్ కు చెందిన తన్నీరు శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం నగరంలోని అంబర్ పేటలోని అలీ కేఫ్ చౌరస్తాలోని పద్మావతి డీపీ రెడ్డి హాల్ (కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్) లో జరిగిన టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశానికి ఫెడరేషన్ రాష్ట్ర కో-కన్వీనర్లు, మాజీ ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, నేషనల్ కౌన్సిల్ సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా ఫెడరేషన్ పరిస్థితి-పరిణామాలపై చర్చించారు. అదే విధంగా జిల్లా కోర్టు, హైకోర్టులలో నడుస్తున్న కేసుల వివరాలు-వాటి పరిస్థితిపై విశ్లేషించారు. దీంతోపాటు జిల్లాలలో సభ్యత్వ నమోదు, జిల్లాల మహాసభల నిర్వహణపై చర్చించారు. జిల్లా మహాసభల అనంతరం రాష్ట్ర మహాసభలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. టిడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో తన్నీరు శ్రీనివాసును రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

**అంచలంచలుగా ఎదిగిన తన్నీరు శ్రీనివాస్**

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ కు చెందిన తన్నీరు శ్రీనివాస్ జర్నలిస్ట్ నాయకులుగా అంచలంచలుగా ఎదిగారు. ఫెడరేషన్ లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులుగా, రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తన్నీరు శ్రీనివాసును రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా శాఖలు హర్షం వ్యక్తం చేశాయి. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని పలువురు జర్నలిస్టులో ఆకాంక్షించారు. నిత్యం జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పరితపించే శ్రీనివాస్ కు సముచిత స్థానం కల్పించారని అన్నారు. ఈ సందర్భంగా తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు, నేషనల్, కౌన్సిల్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం మరింత చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

# గుడుంబాపై పోలీసుల ఉక్కుపాదం..!!

## దమ్మూరు గ్రామంలో పలిమెల పోలీసుల ఆకస్మిక దాడులు

## 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

## అక్రమ మద్యం తయారీదారులపై కఠిన చర్యలు తప్పవన్న ఎస్పీ సంకీర్త్

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** అక్రమ గుడుంబా తయారీ, విక్రయాల నిర్మూలనకు భూపాలపల్లి జిల్లా పోలీసులు చర్యలు మరింత ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో పలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలోని దమ్మూరు గ్రామంలో పోలీసులు దాడులు నిర్వహించి 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 100 లీటర్ల బెల్లం పానకాన్ని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు దమ్మూరు గ్రామ శివారులో



అక్రమంగా గుడుంబా తయారీ జరుగుతున్నట్లు

గుర్తించిన పోలీసులు ప్రత్యేక బృందంతో దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా గుడుంబా తయారీకి వినియోగిస్తున్న సామగ్రిని పరిశీలించి, తయారైన గుడుంబాను స్వాధీనం చేసుకోవడంతో పాటు బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ, అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుడుంబా తయారీ ప్రజారోగ్యానికి, సమాజానికి తీవ్ర హానికరమని పేర్కొంటూ, ఇటువంటి కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. ప్రజలు తమ గ్రామాలు, పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా గుడుంబా తయారీ, నిల్వ లేదా విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతో జిల్లాలో అక్రమ మద్యం నిర్మూలనకు మరింత సమర్థవంతంగా చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.



## దొడ్డి కొమురయ్య సేవలు చిరస్మరణీయం

### కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్, పాలమూరు కురువ సంఘం జంట నగరాల అధ్యక్షులు ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాటేదాన్‌లో దొడ్డి కొమురయ్య చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ పాల్గొని ఆయన సేవలను గుర్తు చేశారు. అనైంతరం మాట్లాడుతూ భూస్వామ్య దోపిడికి, అన్యాయానికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి, రైతాంగ హక్కుల కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. ఆయన త్యాగం, పోరాట స్పూర్తి తరతరాలకు ఆదర్శంగా నిలుస్తుంది అని అన్నారు. త్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవడం మన బాధ్యత వారి ఆశయాల సాధనకు కషి చేయడం మన కర్తవ్యం అని తెలపారు. ఈ కార్యక్రమంలో శ్రీను, ఉప్పల్ ఆనంద్, రామస్వామి, శంకర్, రాజకుమార్, రవి, మూర్తి, రఘు, జి.రాజ్‌కుమార్, బొడ్రాయి శివ, సాయి, మొగ్గి భాగ్యమ్మ, రిషి, శివ, మురళీ, కిష్టమ్మ, శరణమ్మ, లక్ష్మి, హైదరాబాద్, పాలమూరు కురువ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## నీటి సమస్యను పరిష్కరించడంలో జలమండలి అధికారులు విఫలం: కాంగ్రెస్ నాయకులు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** జలమండలి అధికారులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో, సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. హైదర్షాకోట్ గ్రామంలో నీటి సమస్య గత 15 రోజులుగా తీవ్రంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి మేనేజర్ నరేష్‌ను కలిసి సమస్యను వివరించామన్నారు. దీంతో ఆయన టెక్నికల్ సమస్యను పూర్తి చేసి వాటర్ సప్లై చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీంతో శనివారం మళ్లీ జలమండలి అధికారులను కలిసేందుకు వెళ్లగా కార్యాలయంలో ఎవరు అందుబాటులో లేరన్నారు. ప్రస్తుతం అధికారులు ఫీల్డ్ వర్క్‌పై బయటకు వెళ్లారని అక్కడ ఉన్న సిబ్బంది చెప్తున్నారన్నారు. దీంతో తిరిగి సమస్యపై ఫిర్యాదు చేశామన్నారు. సమస్యలపై ఫిర్యాదులు చేస్తున్నాము కానీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నీటి సమస్యను పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబ్లాక్ అధ్యక్షులు డప్పు నవీన్, సీనియర్ నాయకులు సుధాకర్, శంకర్, బీసీ సెల్ నాయకుడు అంకం శ్రీనివాస్ నేత,బోగాల శ్రీనివాస్, చింతాల సుదర్శన్, కట్ట విష్ణు, వార్డు సభ్యులు శ్రీను, ఆమెనీ కుమార్‌యాదవ్ తదితరులున్నారు.

## నార్సింగి, మణికొండలో రూ.2.95 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కోట్లా రూపాయల నిధులను వెచ్చిస్తున్నామని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. నార్సింగి, మణికొండ పరిధిలో రూ.2.95 కోట్లతో అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. నార్సింగి సర్కిల్ పరిధిలో ప్రజల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన పలు కమ్యూనిటీహాల్స్, అంగన్‌వాడీ భవనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో రూ.2.95 కోట్ల నిధులతో ఈ భవనాలను నిర్మించడం జరిగిందన్నారు. వార్డు నెంబర్ 124 పరిధిలోని నార్సింగి కమ్యూనిటీహాల్‌ను రూ.2 కోట్లతో భారీ వ్యయంతో నిర్మించారన్నారు. అలాగే వార్డు నెంబర్ 127 పుప్పాలగూడ కమ్యూనిటీహాల్‌ను రూ.65 లక్షల వ్యయంతో నిర్మించడం జరిగిందన్నారు. వార్డు నెంబర్ 127 పరిధిలోని నెమలినగర్‌లో రూ.30 లక్షల



వ్యయంతో నూతనంగా అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించి ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పిసిసి ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, అశోక్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు ఉషారాణి, ప్రవళిక కిరణ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# దేవాలయ భూమిలో అక్రమ నిర్మాణం

### గోడపై నోటీసులు అంటించిన దేవాదాయ శాఖ అధికారులు





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అత్తాపూర్ గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయ భూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై దేవాదాయ శాఖ అధికారులు శనివారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాలయానికి చెందిన సర్వే నెంబర్లు 72 నుంచి 77 వరకు గల స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా షెడ్డు(భవనం నిర్మాణం) నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ విషయమై ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీకాంత్ నేతృత్వంలో అధికారులు తనిఖీలు చేపట్టి సదరు నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాల్సిందిగా ఆదేశిస్తూ శనివారం అక్కడి గోడపై అధికారిక నోటీసులు అంటించారు. దేవాలయ భూమిలో సాగుతున్న అక్రమ నిర్మాణాన్ని తక్షణమే ఆపివేయాలని హెచ్చరించారు. అంతేకాకుండా ఆ భూమిపై నిర్మాణదారులు తమకు గల యాజమాన్య హక్కులను రుజువు చేసే చట్టబద్ధమైన పత్రాలను వెంటనే అధికారుల ముందు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. నిర్దేశిత గడువులోగా భూమికి సంబంధించిన సరైన పత్రాలను సమర్పించని యెడల, ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే అక్రమ నిర్మాణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. దేవాలయ చట్టం 30/87 నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించడం నేరం

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మీర్పేట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శోభన్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన పదిమందిని మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుచుతామని తెలుపుతూ, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## దేవాలయాల్లో మనశాంతి, ప్రశాంతత

### రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

### ఈ నెల 9వ తేదీన శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ దేవాలయ పున ప్రతిష్ట మహాకుంభాభిషేక మహోత్సవం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** దేవాలయాల్లో మనశాంతి, ప్రశాంతత లభిస్తాయని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఎర్రబోడలో శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ దేవాలయ పున ప్రతిష్ట మహాకుంభాభిషేక మహోత్సవ ఆహ్వాన ప్రతికను శనివారం దేవాలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌కు అందజేసి ఆహ్వానించారు. తప్పకుండా మహోత్సవాలకు హాజరవుతారని ఆయన హామీ ఇచ్చినట్లు నిర్వహకులు తెలిపారు. ఈ నెల 9వ తేదీన ఈ మహోత్సవం ఉంటుందని నిర్వహకులు తెలిపారు. శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ అమ్మవారి యంత్ర ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, శాంతి పౌష్టికమంత్రి హవసములు, జయాది హోమం, బలిప్రదానం, పూర్ణాహుతి, మహాకుంభాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదిలాబాద్‌లోని శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠం 10వ మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతీ స్వామిజీ కరకములచే ప్రతిష్ట మహోత్సవాలు జరుగుతాయన్నారు. దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహోత్సవానికి స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామ ఇంద్రపాల్ రెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

## ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### తపస్ రాజేంద్రనగర్ మండల శాఖ డిమాండ్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తపస్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు శనివారం రాజేంద్రనగర్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ బొమ్మ రాములు ద్వారా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తపస్ రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు మదగని బాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి గుంజరి బాలకృష్ణ, రాష్ట్ర సంఘటన కార్యదర్శి కె. హనుమంత్ రావు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను పరిష్కరించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. నూతన పీఆర్సీ ని తక్షణమే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ లను వెంటనే ప్రకటించాలని కోరారు. ఈ–కుబేర్ పోర్టల్‌లో నెలల తరబడి పేరుకుపోయిన ఉపాధ్యాయుల వివిధ బిల్లులకు సత్వరమే నిధులు మంజూరు చేయాలన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన అన్ని రకాల పెండింగ్ బిల్లులను తక్షణమే క్లియర్ చేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తూ, సీపీఎస్ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్స్, గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతుల కల్పన కొరకు ప్రత్యేక గ్రాంట్లను విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, తగిన నిధులు విడుదల చేయకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్, రాజేంద్రనగర్

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 ఆదివారం 5-7-2026


# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే వేముల వీరేశం.. వెలిమినేడు లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం







చిట్యాల మండలం వెలిమినేడు గ్రామం అభివృద్ధి బాటలో మరో ముందడుగు వేసింది. గ్రామ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం శంకుస్థాపన చేశారుఈ సందర్భంగా గ్రామ ప్రజలు, వివిధ సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని ఎమ్మెల్యే ఘన స్వాగతం పలికారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

శంకుస్థాపన చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలుఎస్సీ కమ్యూనిటీ హాల్

**పాత రాచకాల్వ నిర్మాణం**

ప్యాక్స్‌లో డిజిటల్ సేవా కేంద్రం ఏర్పాటు పలు సీసీ రోడ్ల నిర్మాణ పనులు గౌడ సంఘం, రజక సంఘం, ఎరుకల సంఘం, నాయీబ్రాహ్మణ సంఘం, యాదవ సంఘం, ముదిరాజ్ సంఘంభవనాల నిర్మాణ పనులు గ్రామ ప్రజలకు విద్యా, సామాజిక మరియు మహిళా సాధికారతకు తోడ్పడేలా గ్రంథాలయం మరియు మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. ఇక అభివృద్ధిలో భాగంగా ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన పెట్రోల్ బంక్‌ను ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం ప్రారంభించి రైతులు, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఈసందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి వర్గానికి ఉపయోగపడే విధంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంతల చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ అంతటి స్వప్న సత్తయ్య, అంతటి పారిజాత నరసింహ, చిట్యాల మార్కెట్ చైర్మన్ నర్ర వినోద మోహన్ రెడ్డి,ఏనుగు రఘుమా రెడ్డి, బొంతల అంజిరెడ్డి, దేశ బోయిన మల్లమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జడల చిన్న మల్లయ్య, ,అంతటి రాజు, అంతటి శ్రీను, నాతి కిరణ్, గోలి అరవింద్, నాతి స్వామి, బైకని స్వామి, లోడే లింగస్వామి , పబ్బుగిరి,తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా గురువందన్-ఛాత్రాభినందన్ కార్యక్రమం

### నిర్వహించిన భారత్ వికాస్ పరిషత్ జిజాబాయి శాఖ



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** భారత్ వికాస్ పరిషత్ జిజాబాయి శాఖ మణికొండ ఆధ్వర్యంలో శనివారం మణికొండ న్యూ కమ్యూనిటీ హాల్‌లో గురువందన్-ఛాత్రాభినందన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుంచి పాల్గొన్న 27 మంది ఉపాధ్యాయులు, 54 మంది ప్రతిభావంతులైన విద్యార్థులతో పాటు వేద పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులను కూడా ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీవీపీ తెలంగాణ ప్రాంత పూర్వ ఆర్గనైజింగ్ సెక్రటరీ,ఎన్విరాన్‌మెంట్ కన్వీనర్, సంపర్క్? ప్రముఖ్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత రఘు సతీష్‌కుమార్, బీవీపీ చీఫ్ ప్యాట్రన్ డా కాలనీ ప్రెసిడెంట్ రాజశేఖర్‌లు పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా సౌత్ రీజియన్ జాయింట్ సెక్రటరీ ఈడి నాగరాజు, తెలంగాణ ప్రాంత సెక్రటరీ శివరామకృష్ణలు హాజరైయ్యారు. ఈ సందర్భంగా రఘుసతీష్‌కుమార్ మాట్లాడుతూ గురువుల సపేవలు సమాజ నిర్మాణానికి పునాదులని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. తెలంగాణ ప్రాంత సెక్రటరీ భారత్ వికాస్ పరిషత్ సేవా కార్యక్రమాలు, సంస్థ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో శాఖ అధ్యక్షులు ఎం.పెంటారెడ్డి, కార్యదర్శి ఎం.మల్లేష్, ఖజాంచి శ్రీనివాసరావు, కన్వీనర్ సి.సత్యలక్ష్మి, భాస్కర్, సతీష్, రామానుజన్, రామారావు, కాశీ బుజయ్య, ఈరన్న, హర్షన్‌రెడ్డి, ప్రసాద్‌రావు, బీజేపీ నాయకులు వందన, సిద్ధప్ప, రామకృష్ణ, దూళిపాల తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీవీపీ జాయింట్ సెక్రటరీ పి.వి.జగన్నాథ్ డాన్స్? స్కూల్ విద్యార్థులచే భరతనాట్యం గురువులపై ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకున్నాయి.

# 700పైగా ఓటర్లు- ఒకే ఫోన్ నెంబర్

### మణికొండ ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ ఫిర్యాదు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మణికొండ డివిజన్ ఎన్నికల జాబితాలో ఒకే మొబైల్ నంబర్‌కు 700కు పైగా ఓటర్లు నమోదైనట్లు గుర్తించామని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ ఫోన్ నంబర్ ఒక జాతీయ రాజకీయ పార్టీకి చెందిన జిల్లాస్థాయి నాయకుడిదిగా ప్రాథమికం గుర్తించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. టీపీసీసీ స్టేట్ కోఆర్డినేటర్ వాసిరెడ్డి నరేష్ మాట్లాడుతూ ఎన్నికల జాబితా పరిశీలనలో ఒకే మొబైల్ నంబర్‌తో 700కు పైగా ఓటర్లు అనుసంధానమై ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. సంబంధిత ఓటర్ల డబ్ల్యుపికే నెంబర్లతో పాటు పూర్తి వివరాలను అధికారులకు అందజేసినట్లు తెలిపారు. ఫిర్యాదును స్వీకరించిన డిప్యూటీ కమిషనర్ వెంటనే స్పందించి, సంబంధిత అధికారులను పిలిపించి అంశంపై తక్షణ విచారణ చేపట్టలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం విచారణ నిర్వహించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించినటుల వెల్లడించారు. ఎన్నికల జాబితాలో చోటు చేసుకున్న ఈ అంశంపై సమగ్ర విచారణ వాస్తవాలను వెలికితీయాలని, ఓటరు జాబితా పారదర్శకతను కాపాడేందుకు బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# టీజీఐఆర్‌డీలో సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు

## 520 మంది ప్రతినిధులకు రాజేంద్రనగర్ పోలీసుల మార్గదర్శకత్వం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రోజురోజుకూ పెరుగుతున్న డిజిటల్ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు రాజేంద్రనగర్ జోన్ పోలీసులు శనివారం భారీ సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజేంద్రనగర్ లోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (టీజీఐఆర్‌డీ) వేదికగా జరిగిన ఈ సదస్సులో ఎస్సీఈఆర్‌టీ రాష్ట్ర రిసోర్స్ పర్సన్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు , వ్యవసాయ రంగ నిపుణులతో కలిపి మొత్తం 520 మంది కీలక సామాజిక ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా, ప్రధాన వక్తగా హాజరై నేతృత్వం వహించారు. సదస్సులో డీసీపీ ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో సైబర్ నేరగాళ్లు సాగించే మానసిక ఉచ్చులను, వారి పనితీరును వివరంగా విశ్లేషించారు. ముఖ్యంగా ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న మూడు ప్రధాన మోసాల పట్ల ప్రతి నకిలీ స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు (లాభాల పేరుతో ఆశ చూపడం), పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరిట వచ్చే నకిలీ ఆఫర్లు, డిజిటల్ అరెస్ట్ పేరుతో భయభ్రాంతులకు గురిచేసే సరికొత్త మోసాలు జోనల్ సైబర్ సెల్ సిబ్బందితో కలిసి డిజిటల్ పేమెంట్ గేట్‌వేలను సురక్షితంగా ఉంచుకోవడం, ప్రభుత్వ పరిపాలనా పోర్టల్‌లను రక్షించడం, ఫిషింగ్ లింక్‌ల బారిన పడకుండా ఉండటం, పాఠశాలలు, గ్రామీణ నెట్‌వర్క్‌లలో సామాజిక మాధ్యమాలను సురక్షితంగా ఎలా ఉపయోగించాలనే అంశాలపై కీలక సూచనలు చేశారు. ఈ సదస్సులో సైబర్ సెల్ అధికారులు గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతను ప్రత్యేకంగా నొక్కి చెప్పారు. ఏదైనా ఆర్థికపరమైన సైబర్ మోసం జరిగిన వెంటనే మొదటి గంట లోపు బాధితులు వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కి ఫోన్ చేయాలన్నారు. దీనివల్ల బాధితుల ఖాతాల నుండి దొంగిలించబడిన సొమ్మును సైబర్ నేరగాళ్ల మనీ మ్యూల్ ఖాతాల్లోనే పోలీసులు తక్షణమే ఫ్రీజ్ (స్తంభింపజేసే) చేసే అవకాశం ఉంటుందని డీసీపీ స్పష్టం చేశారు. సదస్సు ముగింపులో, హాజరైన 520 మంది ప్రతినిధులు తమతమ పరిధిలోని విద్యాసంస్థలు, గ్రామీణ ప్రాంతాలు, కార్యాలయాల్లో సైబర్ సేఫ్టీ అంబాసిడర్లుగా వ్యవహరించాలని రాజేంద్రనగర్ పోలీసులు కోరారు. ఇక్కడి భద్రతా సూత్రాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి, డిజిటల్ సురక్షిత సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ టి. శ్రీనివాస్, రాజేంద్రనగర్ ఇన్ స్పెక్టర్ ఎం. ముత్తు యాదవ్, జోనల్ సైబర్ సెల్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. మల్లేశం, సైబర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో చురుగ్గా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

### ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి

### కొనసాగుతున్న పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ

### సమాంతరంగా డిజిటలైజేషన్ ప్రక్రియ

### మునిసిపల్, మండల కేంద్రాల్లో సహాయక కేంద్రాల ఏర్పాటు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సవరణ కార్యక్రమం అత్యంత పారదర్శ కంగా, చురుగ్గా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపా రు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించ డమే ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు. కొత్త ఓటర్లను చేర్చడం, చనిపోయిన వారిని ఓటరు జాబితా నుండి తొలగించడం ఓటర్ల వ్యక్తిగత వివరాల్లో అవసరమైన సవరణలు చేపట్టడం ఈ ప్రక్రియ లో చేస్తారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ ఇప్పటికే విజయవంతంగా పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. పంపిణీ చేసిన ఫారాలను పూర్తి చేసి, తిరిగి స్వీకరించే ప్రక్రియ ప్రస్తుతం వేగంగా కొనసాగుతోందన్నారు. అర్హులైన వారందరూ తమ వివరాలను సకాలంలో అందించాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో 1460 మంది బూత్ లెవల్ అధికారులు ఓటరు ప్రత్యేక సవరణ కార్యక్రమంలో నిమగ్నమై పనిచేస్తున్నట్లు కలెక్టర్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా 98.82 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేసినట్లు, ఇప్పటివరకు 11.85 శాతం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. స్వీకరించిన ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా చేపడుతున్నట్లు కలెక్టర్ అన్నారు. దీనివల్ల ఓటర్ల జాబితా మరింత ఖచ్చితత్వంతో రూపొందుతుందని తెలిపారు.ఓటర్లకు సహకరించడానికి మునిసిపల్, మండల కేంద్రాల్లో సహాయక కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ అన్నారు. సహాయక కేంద్రాల బాధ్యులు ప్రజల సందేహాలు తీర్చడంతో పాటు, ఎన్యుమరేషన్ ఫారాలు నింపడంలో సహకరిస్తారని తెలిపారు.ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని కలెక్టర్ అన్నారు. ఇది పూర్తిగా నిబంధనలకు లోబడి, పారదర్శకంగా జరుగుతున్న ప్రక్రియ అని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కల్పించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణతో జిల్లా యంత్రాంగం పనిచేస్తున్నట్లు అన్నారు.ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఓటరు నమోదు, సవరణ ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# ప్రజా విప్లవ గాయకుడు కామ్రేడ్ అరుణోదయ... నాగన్నకు ఇవే మా జోహార్లు

### ఆయన జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి డా కె వి కృష్ణారావు అరుణోదయ... నాగన్న పార్థిక దేహాన్నికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు . ప్రజా సాంస్కృతిక ఉద్యమం పట్ల ఆయనకున్న నిబద్ధత చాలా గొప్పదని ఆయన మరణం బహుజనులకు తీరని లోటని పేద కుటుంబంలో జన్మించి ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొన్న మహనీయుడని ఆయన జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం ఆయన ఆటపాటలతో సమాజాన్ని మేల్కొల్పి పేదవాడి గుండెలో వెలుగై నిలిచారని అన్నారు . ఈ కార్యక్రమంలో పగడాల నరేందర్ , బొబ్బిలి భరత్ చంద్ర , బానోతు భద్రు నాయక్ , అనిల్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు .



# బండ్లగూడ జాగీర్ పరిధిలో పౌర సమస్యలపై ఏసీఎఫ్ క్షేత్రస్థాయి పరిశీలన జీహెచ్ఎంసీ వనరుల బలోపేతానికి వినతి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** బండ్లగూడ జాగీర్, కిస్మత్‌పూర్, హైదర్‌షాకోట్ వార్డుల ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రతినిధులు శనివారం 121, 122, 123 డివిజన్లలోని వివిధ కాలనీలలో విస్తృతంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. నివాసితులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న పలు పౌర సమస్యలను ఈ సందర్భంగా బృందం స్వయంగా పరిశీలించి, మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగానే సమస్యలు పునరావృతమవుతున్నాయని గుర్తించింది. పలు కాలనీలలో తీవ్రమైన డ్రైనేజీ మురుగునీరు రోడ్లపై పొంగిపొర్లుతోంది, అనేక ఫిర్యాదులు 15 రోజులుగా పెండింగ్‌లోనే ఉన్నాయి, మూడు డివిజన్లకు కలిపి కేవలం ఒక్క సీవరేజ్ క్లీనింగ్ వాహనం మాత్రమే ఉండటం, పారిశుద్ధ్య సిబ్బంది కొరత వల్ల పనులు నత్తనడకన సాగుతున్నాయని ఏసీఎఫ్ పేర్కొంది. లైన్ క్లియరెన్స్ కోసం కత్తిరించిన చెట్టు కొమ్మలు రోడ్లు, ఫుట్‌పాత్‌లపై రోజుల తరబడి అలాగే వదిలేస్తున్నారు. దీనివల్ల ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. బండ్లగూడ జాగీర్, కిస్మత్‌పూర్, హైదర్‌షాకోట్ ప్రాంతాల్లో వాటర్ లైన్‌మెన్‌ల తీవ్ర కొరత కారణంగా క్రమరహిత నీటి సరఫరా జరుగుతోందని, పైప్‌లైన్ లీకేజీల ఫిర్యాదుల పరిష్కారంలో తీవ్ర ఆలస్యం జరుగుతోందని స్పష్టం చేశారు. సరైన సిబ్బంది, పరికరాలు లేకపోవడం, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య క్రమబద్ధమైన ఫాలోఅప్ లోపించడంతో అనేక సాధారణ పౌర ఫిర్యాదులు ఆరు నెలలకు పైగా ఫైళ్లలోనే మగ్గిపోతున్నాయని బృందం ఆందోళన వ్యక్తం చేసింది. పరిశీలన అనంతరం బృందం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమీషనర్ అందుబాటులో లేకపోవడంతో డీఈఈ యాదయ్య ని కలిసి వివరణాత్మక వినతి పత్రాన్ని సమర్పించింది. 121, 122, 123 డివిజన్ల కోసం పారిశుద్ధ్య సిబ్బందిని పెంచి, అదనపు డ్రైనేజీ క్లీనింగ్ వాహనాలను కేటాయించాలన్నారు. కత్తిరించిన కొమ్మలను వెంటనే తొలగించేందుకు జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖల మధ్య ఉమ్మడి ప్రోటోకాల్ ఏర్పాటు చేయాలన్నారు. నీటి సరఫరా సక్రమంగా జరిగేలా తగినంత మంది వాటర్ లైన్‌మెన్‌లను నియమించాలన్నారు. ఏసీఎఫ్ లేవనెత్తిన అంశాలపై డీఈఈ యాదయ్య సానుకూలంగా స్పందించారు. అన్ని పెండింగ్ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో చేపడతామని, మూడు డివిజన్లకు వీలైనంత త్వరగా కొత్త డ్రైనేజీ క్లీనింగ్ వాహనాలను కేటాయించి, వచ్చే వారంలోపు నివేదించిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎఫ్ అధ్యక్షులు వినయ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్ బాబు, ప్రతినిధులు వంశీ, హేమశేఖర్, రవి రాజ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.




## ప్రతి అర్హులైన ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారమ్ అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలి

**భారత ఎన్నికల సంఘం డిప్యూటీ సీఈవో జయచంద్రరెడ్డి**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** భారత ఎన్నికల సంఘం డిప్యూటీ సీఈవో జయచంద్రరెడ్డి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)లో భాగంగా జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ ప్రక్రియను అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.నరేందర్‌రెడ్డితో కలిసి బండ్లగూడ జాగీరు పరిధిలోని ఇంటింటికి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రత్యేక్షంగా పరిశీలించారు. అధికారులు ఫీల్డ్ స్థాయిలో చేపడుతున్న చర్యలను పరిశీలించి, ఫారమ్‌ల పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా, నిర్ధేశిత మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అలాగే ప్రతి అర్హులైన ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారమ్ అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శాస్త్రీపురం డివిజన్‌లో ఉచిత ఎన్యూమరేషన్ ఫారాల భర్తీ కార్యక్రమం

**ఏఐఎంఐఎం ఆధ్వర్యంలో సమీక్ష**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్ ఎంపీ, ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ ఖాద్రీ పర్యవేక్షణలో శనివారం శాస్త్రీపురం డివిజన్ పరిధిలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించారు. హసన్ నగర్ లోని మస్జిద్-ఎ-ఆదమ్ అలైహిస్సలాం (అహలే హదీస్) సమీపంలో స్థానిక ప్రజల కోసం ఉచిత ఎన్యూమరేషన్ ఫారాల భర్తీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శివరాంపల్లి మాజీ కార్పొరేటర్ హబీబ్ జైన్ ఆరిఫ్ స్వయంగా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి, ప్రజలకు అవసరమైన ఫారాలను ఉచితంగా పూర్తి చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాన్ని మాజీ కార్పొరేటర్ హబీబ్ జైన్ ఆరిఫ్ తో పాటు పలువురు పార్టీ ముఖ్య నేతలు, మస్జిద్ కమిటీ సభ్యులు సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు.మస్జిద్ కమిటీ సభ్యుడు సయ్యద్ నజీర్ అలియాస్ షేరు భాయ్, మహమ్మద్ ఫైసల్ , మహమూద్ నగర్ ఏఐఎంఐఎం ప్రైమరీ యూనిట్ ప్రెసిడెంట్ మహమ్మద్ జహంగీర్, ఏఐఎంఐఎం క్రియాశీలక నాయకులు మహమ్మద్ అయూబ్, మహమ్మద్ సిద్దిఖ్, మిస్బా అబ్దుల్ కరీం తదితరులు పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణ, ఫారాల భర్తీ ప్రక్రియను సులభతరం చేస్తూ, తమ నివాస ప్రాంతాల వద్దకే వచ్చి ఉచితంగా సేవలు అందించినందుకు స్థానిక ప్రజలు ఏఐఎంఐఎం పార్టీ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలి

**బీఎల్ఓలకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచన**




**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, జూలై 4:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ బీఎల్ఓలకు సూచించారు. శనివారం మిర్యాలగూడ మున్సిపాలిటీ 3వ వార్డులోని 133, 134 పోలింగ్ కేంద్రాల పరిధిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల్లో 2002 ఓటరు జాబితాలో ఉన్నవారి వివరాలు, జాబితాలో లేనివారి నమోదు, ఫారాలు--6, 7, 8 వినియోగంపై బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు.ఎస్ఐఆర్ కార్యక్రమంలో బీఎల్ఏల సహకారం గురించి ఆరా తీశారు. సవరణ ప్రక్రియలో ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా నమోదు చేయాలని, ఎలాంటి తప్పిదాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఎన్యూమరేషన్ ఫారాలు అందుకున్న వారంతా వాటిని తిరిగి సమర్పిస్తున్నారా అనే అంశాన్ని కూడా పరిశీలించారు. ఇంట్లో ఎవరైనా అందుబాటులో లేకుంటే మరోసారి ఆ ఇంటిని సందర్శించి వారి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని బీఎల్ఓలకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ తహసీల్దార్ పి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అమరవీరుడు దొడ్డి కొమురయ్య త్యాగస్ఫూర్తి చిరస్మరణీయం

**80వ వర్ధంతి సందర్భంగా గన్‌పార్క్‌లో ఘన నివాళులు**

**అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి : పూజారి ప్రవీణ్ కురుమ**



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ గన్‌పార్క్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజారి ప్రవీణ్ కురుమ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని, సామాజిక న్యాయం, సమానత్వం, హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. అన్యాయానికి ఎదురు నిలిచి ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మాత్రమే కాకుండా, వారు కలలు కన్న సమానత్వ సమాజ నిర్మాణానికి అందరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. యువత చరిత్రను తెలుసుకుని అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, వారి త్యాగాలను భావితరాలకు చేరవేయాల్సిన అవసరం ఉందన్నారు.



## మైలర్ దేవ్ పల్లిలో ప్రజా సమస్యలను పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్‌కు టీడీపీ నాయకుడు ఉస్కెమురి విజయకుమార్ వినతి**

గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని గ్రామాలు, బస్తీల్లో నెలకొన్న తీవ్రమైన ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు తెలుగుదేశం పార్టీ నాయకుడు యు. ఉస్కెమురి విజయకుమార్ శనివారం వినతిపత్రం సమర్పించారు. డివిజన్ వ్యాప్తంగా ఉన్న స్థానిక సమస్యలపై కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయి పర్యటన (ఫీల్డ్ విజిట్) నిర్వహించి, ప్రజల ఇబ్బందులను పరిశీలించాలని ఆయన కోరారు. మైలర్దేవపల్లి డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య లోపం, మౌలిక వసతుల కొరత కారణంగా ప్రజల దైనందిన జీవితం తీవ్రంగా ప్రభావితమవుతోందన్నారు. డివిజన్ లోని పలు బస్తీల్లో డ్రైనేజీలు రోడ్లపై పొంగిపొర్లుతున్నాయి, రోడ్ల పక్కన చెత్త భారీగా పేరుకుపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా క్షీణించిందన్నారు. గుంతలమయంగా మారిన రోడ్ల వల్ల వాహనదారులు, స్థానిక ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. ఇందిరమ్మ క్యాంటీన్ వద్ద భోజనం చేసే పేదలు, కార్మికులకు ఎండ, వర్షాల నుండి రక్షణ కల్పించే కనీస షెడ్ లేదా నీడ సౌకర్యం లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్రీరామ్ కాలనీ నుండి వస్తున్న డ్రైనేజీ మురుగునీరు నేరుగా మధుబన్ కాలనీ చెరువులోకి చేరుతుండటంతో తీవ్ర కాలుష్యం ఏర్పడుతోందని విజయకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే మురుగునీటి కారణంగా పరిసరాల్లోని ఎర్రకుంట, కొత్త చెరువు, పల్లె చెరువులు కూడా పూర్తిగా కలుషితమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ తీవ్రమైన కాలుష్య సమస్యపై మహేశ్వరం నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం వల్లే పరిస్థితి ఇంతలా దిగజారిందని ఆయన విమర్శించారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా శాశ్వత పరిష్కారం లభించలేదని, జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని, మైలర్దేవపల్లి డివిజన్ లో ఒక రోజు క్షేత్రస్థాయి పర్యటన చేసి సమస్యల శాశ్వత పరిష్కారానికి తగిన ఆదేశాలు జారీ చేయాలని యు. విజయకుమార్ డిమాండ్ చేశారు.

## అధికారులు పగలు ఇసుక డంపులు సీజ్ చేస్తారు

**రాత్రి రాత్రికే ఇసుకను మాయం చేస్తున్న వ్యాపారులు**

**అధికారుల అండతో మాయం చేస్తున్నారని ప్రజల ఆవేదన**



**పెబ్బేరు జూలై 04 క్రైమ్ మిర్రర్ :** అక్రమ ఇసుక దందాకు అడ్డు లేకుండా పోతున్నాయి. అధికారులు పట్టుకున్న గంటల్లోనే రాత్రి వేళల్లో ఇసుకు మాయం అవుతుంది. పెబ్బేరు మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో అధికారులు ఇసుక డంపులు పగలు సీజ్ చేస్తే రాత్రికి రాత్రి అక్రమార్కులు టిప్పర్ల ద్వారా తరలిస్తు మాయం చేస్తున్నారు. పెబ్బేరు మండలం రంగాపురం గ్రామస్తుల వివరాల మేరకు నిత్యం రాత్రి వేళలో కృష్ణానదిలో రాత్రి పూట ఇసుక తవ్వకాలు జరిపి ట్రాక్టర్ల ద్వారా పెద్ద మొత్తంలో డంపులు చేస్తున్న సమాచారం సంబంధిత రెవెన్యూ, పోలీస్ సిబ్బందికి ఇసుక డంపుల గురించి గురువారం గ్రామస్తులు సమాచారం అందించడంతో విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు కృష్ణానది తీరాన ఉన్న రంగాపురం గ్రామానికి చేరుకొని పెద్ద మొత్తంలో ఇసుక డంపులు గుర్తించారు.దాదాపు 112 ట్రాక్టర్ల ఇసుక డంపులు గుర్తించి తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డి,ఎస్ఐ వెంకటేష్ గౌడ్ సీజ్ చేశారు.అయితే గురువారం సీజ్ చేసిన ఇసుకను శుక్రవారం రాత్రి ట్రిప్పర్ల ద్వారా ఇసుకాసురులు రాత్రికి రాత్రి మాయం చేశారు.ఒక పక్క అధికారులు ఇసుక డంపులు సీజ్ చేయడం చేపట్టడం రాత్రికి రాత్రే డంపులు మాయం చేయడం గమనార్హం...వారిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పోలీస్ కేసులు నమోదు చేస్తాం**

సీజ్ చేసిన ఇసుక మాయం కావడం అనేది ఒక తీవ్రమైన చట్టవిరుద్ధమైన చర్య కాబట్టి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేసిన ఇసుక డంపులను శుక్రవారం రాత్రి టిప్పర్ల ద్వారా తరలించిన రంగాపురం గ్రామానికి చెందిన నరేందర్ అనే వ్యక్తిపై పెబ్బేరు పోలీసులకు పిర్యాదు చేశామని తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు.అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎంతటి వారైనా చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కేసులు నమోదు చేయించడమే కాకుండా జరిమానాలు విధిస్తామని వారు తెలిపారు.

# ధాన్యం నిల్వకు ఆధునిక సైలోలు

**మహిళా సంఘాల ద్వారా నిర్వహణ.. బియ్యం ఎగుమతుల సరళీకరణకు చర్యలు: మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**








**మిర్యాలగూడ, జూలై 5 (క్రైమ్ మిర్రర్):** రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం నిల్వ కోసం ఆధునిక సైలోలను నిర్మించి, వాటి నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. రైస్ మిల్లులు, గోదాముల ఆధునికీకరణతో పాటు బియ్యం ఎగుమతి విధానాన్ని మరింత సరళీకరించనున్నట్లు వెల్లడించారు. మిర్యాలగూడ శివారులోని వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ సమీపంలో రూ.150 కోట్ల వ్యయంతో బండారు కుశలయ్య నిర్మించిన బండారు ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ భారీ రైస్ మిల్లును శనివారం మంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావం ఉన్నందున రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. కస్టమ్ రైస్ మిల్లింగ్ (సీఎంఆర్) విధానంలో ఉన్న లోపాలను సరిదిద్దనున్నట్లు తెలిపారు. మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని సకాలంలో ప్రభుత్వానికి అందిస్తున్నారని చెప్పారు. రబీ సీజన్‌లో రైతుల నుంచి 81 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.19,300 కోట్లు చెల్లించినట్లు మంత్రి వెల్లడించారు. వానాకాలం, రబీ కలిపి మొత్తం 150 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించిందన్నారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులను తమ ప్రభుత్వ హయాంలోనే రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. రూ.150 కోట్లతో ఆధునిక రైస్ మిల్లును నిర్మించిన బండారు కుశలయ్యను మంత్రి అభినందించారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే రైస్ మిల్లుల అభివృద్ధికి పునాది అని అన్నారు. ప్రభుత్వం ఎన్నడూ లేనివిధంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగించకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎమ్మెల్సీ కె. శంకర్ నాయక్ మిల్లర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేముల వీరేశం, డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత, మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, ఆల్ ఇండియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కార్యదర్శి గుండా మల్లయ్య, మిట్టపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం

**ఇందిరమ్మ ఆడపడుచు చీరల పంపిణీకి కాంగ్రెస్ నాయకుల కసరత్తు**

**-- ప్రతి అర్హ మహిళకు అందేలా అధికారులతో సమీక్ష**

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగిర్ జీహెచ్ఎంసీ 123వ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఇందిరమ్మ ఆడపడుచు చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతి అర్హ మహిళకు అందేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంబంధిత అధికారులతో సమావేశమై పంపిణీ ప్రక్రియపై చర్చించారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఆడపడుచు చీరలు ప్రతి ఇంటి అక్కాచెల్లెళ్లకు చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నాయకులు కోరారు. అర్హులెవరూ ఈ పథకానికి దూరం కాకుండా పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల గడపకు చేర్చేందుకు పార్టీ నాయకులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత 25 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ప్రజాసేవలో కొనసాగుతున్న సీనియర్ నాయకుల సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏ-బ్లాక్ అధ్యక్షుడు దప్పు నవీన్, బీసీ సెల్ నాయకుడు అంకం శ్రీనివాస్ నేత, వెస్టన్ కాలనీ సుధాకర్, బోగల శ్రీనివాస్, ఎస్. శంకర్, చింతల సుదర్శన్, లక్ష్మణ్, వార్డ్ సభ్యుడు శీను, బాలకుమార్ యాదవ్, కట్ట విష్ణు, తుకారం, జి. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాలనీల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**బీరంగూడలో పర్యటన.. 4,745 గజాల్లో నూతన పార్కుకు హామీ**





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 04:** పటాన్‌చెరు నియోజకవర్గంలోని కాలనీల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన నిధులు కేటాయిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. శనివారం ఉదయం బీరంగూడ డివిజన్ పరిధిలోని సిద్ధార్థ కాలనీ, ప్రణీత్ కౌంటీ మిత్ర విహార్ కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో సమావేశమై తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, పార్కులు తదితర సమస్యలపై వారి అభిప్రాయాలను తెలుసుకుని సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గ్రీన్ మెడోస్ కాలనీ, మిత్ర విహార్ కాలనీల మధ్య ఉన్న 4,745 గజాల స్థలంలో ఆధునిక సౌకర్యాలతో నూతన పార్కును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. పిల్లల ఆట పరికరాలు, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, పచ్చదనం వంటి సదుపాయాలతో పార్కును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కాలనీల్లో సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామాలు, మున్సిపాలిటీలు, డివిజన్ల పరిధిలోని కాలనీల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను నేరుగా పరిశీలిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హ ఓటరు తప్పనిసరిగా పాల్గొని, స్థానికంగా తమ ఓటు హక్కును నమోదు చేసుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తమ కాలనీలో ఎమ్మెల్యే స్వయంగా పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇవ్వడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, డీఈ వెంకటరమణ, విద్యుత్ శాఖ ఏడీఈ సంజయ్, మాజీ ప్రజాప్రతినిధులు కృష్ణ, మల్లేష్, సీనియర్ నాయకులు గోపాల్, జగదీష్, తులసి రెడ్డి, శ్రీకాంత్ తదితరులు, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

# ఆభివృద్ధి నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని రాజేంద్రనగర్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తేలేత్తకుండా పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న ప్రాజెక్ట్స్, ఇంజినీరింగ్ ఆభివృద్ధి నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని జీ హెచ్ యం సి రాజేంద్రనగర్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాజేంద్రనగర్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి వివిధ విభాగలకు చెందిన అధికారులతో కలిసి శనివారం ఉదయం జోన్ పరిధిలోనీ ఛత్రినాక, కందికల్ గేట్ ఆర్ ఓ బీ, బోయిగూడ, చాంద్రాయణ గుట్ట, డి ఆర్ డి ఎల్ కంచన్ బాగ్, మిధాని రోడ్, ఆషామాబాద్, బండ్లగూడ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఛత్రినాక ప్రధాన చౌరస్తాలో కొనసాగుతున్న స్ట్రామ్ వాటర్ పైప్ లైన్, సిసి రోడ్డు నిర్మాణ పనులను, పరిశీలించి పనుల పురోగతిపై అధికారులతో ఆరా తీశారు. పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న పనులను నిర్దేశిత గడువులోపు నాణ్యతతో పూర్తి చేయాలని, పారిశుద్ధ సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు . ఈ సందర్బంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఛత్రినాక ప్రధాన చౌరస్తాలో జరుగుతున్న అభివృద్ధి నిర్మాణ పనుల కారణంగా సమస్యలు రాకుండా




చూడాలన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. పనుల్లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. చాంద్రాయణగుట్ట - ఛత్రినాక ప్రధాన రోడ్డు కావడంతో నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జోన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో స్థానిక శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుధ్య సమస్యలు తేలేత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో జంగమెట్, చాంద్రాయణ గుట్ట సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు సురేందర్, పాపయ్య, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ నరేందర్ గౌడ్, యూబీడి డిప్యూటీ డైరెక్టర్ విష్ణు వర్ధన్, ఎలక్ట్రికల్ డిఈ సత్యనారాయణ రెడ్డి, ఈఈ, డిఈ లు, ఏఈ లు, శానిటేషన్, ఇతర అధికారులు, పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత, ప్రజా సేవలో నిబద్ధతతో పని చేయాలి





## తెలంగాణ రవాణా శాఖ అడిషనల్ కమిషనర్ సి.రమేష్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ఐదు నెలల పాటు శిక్షణ పొందిన 15 మంది అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల శిక్షణ ముగింపు సందర్భంగా శనివారం అకాడమీ సెమినార్ హాల్‌లో పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రవాణా శాఖ అడిషనల్ కమిషనర్ సి.రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసిన అధికారులకు అభినందనలు తెలియజేస్తూ సర్టిఫికెట్లు ప్రధాన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలోనే అత్యుత్తమ పోలీస్ శిక్షణా సంస్థగా గుర్తింపు పొందిన ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడామీలో శిక్షణ పొందిన ప్రతి ఏఎంవిఐకి ఒక గొప్ప అవకాశం అని అన్నారు. రోడ్డు భద్రతను పెంపొందించడం, ప్రమాదాలను తగ్గించడం, ప్రజల ప్రాణాలను కాపాడడం ప్రతి రవాణా శాఖ అధికారి ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. అధికారులు తమ ఉద్యోగ జీవితంలో విలువలు, నిజాయితీ, క్రమ శిక్షణ, వత్తిపరమైన ప్రతిష్టను కాపాడుకోవాలని సూచించారు. కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ తమ పరిజ్ఞానాన్ని నిరంతరం పెంపొందించుకోవాలని, ప్రజలకు రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నియమాలు, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై విస్తత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ఉద్యోగ జీవితంలో సీనియర్ అధికారుల మార్గదర్శకత్వం, అనుభవం ఎంతో ఉపయోగపడుతు దని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్, రవాణా శాఖ కమిషనర్ ఇలీఆంబర్తి అందించిన సహకారం ప్రశంసనీయమని పేనర్కొన్నారు. ఐదు నెలల శిక్షణలో అత్యుత్తమ ప్రతిభకనబరిచిన శిక్షణార్ధులకు ట్రోఫీలు అందజేశారు. ఆల్ రౌండర్, ఇండోర్ విభాగంలో ఉత్తమ ప్రతిభకనబరిచిన జానకిరాం (ఏఎంవిఐ)కు, ఔట్ డోర్ విభాగంలో ఉత్తమ ప్రతిభకన బరిచిన స్రవంతి(ఏఎంవిఐ)కు అడిషనర్ కమిషనర్ సి.రమేష్ ట్రోఫీలు ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ వేమా శ్రీనివాసరెడ్డి, అకాడమి డిప్యూటీ డైరెక్టర్ కె.ఆర్.కె.ప్రసాద్, డిటివో రవీంద్రకుమార్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామమూర్తి, ఆర్‌టివో రఘునందన్‌గౌడ్, అసిస్టెంట్ డైరెక్టర్ యార్లగడ్డ రాంబాబు, రఘునందన్‌గౌడ్, డీపీవో రవీంద్రకుమార్, శీతల్, రామారావు, ఆదూరి శ్రీనివాసరావు, కష్ణ, తిరుపతి, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.